# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 215 | విశాఖపట్నం | 6-5-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 215 | VISAKHAPATNAM | 6-5-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | Pay



Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram





2లో

**విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేసిన కేంద్రం**



5లో

**అందుబాటులోకి ఖమ్మం-దేవరాపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే..**



6లో

**పిల్లల్లో బీపీ రావడానికి కారణాలేమిటి?**



# తవ్వుకో.. అమ్ముకో.. ఎవ్వర్రా మమ్ములను ఆపేది..

- ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాల్లో భారీగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- పోలవరం, పుష్కర కాలువల వెంబడి మట్టి, గ్రావెల్ తరలింపు
- మాముళ్ల మత్తులో అధికారులు..

**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లాలో తవ్వుకో, అమ్ముకో అనేలా పరిస్థితి ఉంది. మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల అనుచరులు, కొందరు ముఖ్యనాయకులు ఈ అక్రమానికి పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల్లో పోలవరం ఎడమ కాలువ, పుష్కర కాలువల మట్టిని నిరంతరాయంగా తరలిస్తున్నారు. కొందరు అధికార పార్టీ నేతల అండదండలతో ఎలాంటి అనుమతులూ తీసుకోకుండానే రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాల్లో మట్టిని అక్రమంగా తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. జగ్గంపేట మండలం జె.కొత్తూరు, మన్యవారిపాలెం, మల్లిశాల, గుర్రంపాలెం, కాట్రావులపల్లి గ్రామాల్లో చెరువుల నుంచి సైతం మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. గండేపల్లి మండలం కె.గోపాలపురం, ఉప్పలపాడు, మురారి, రామేశ్వరంపేట, గండేపల్లిలోని చెరువులనూ విడిచిపెట్టడం లేదు. పోలవరం కాలువ మట్టిని, కిర్లంపూడి మండలంలోని కొన్నిచోట్ల చెరువుల్లోనూ యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.

మట్టి, గ్రావెల్ తవ్వకాలను వివిధ శాఖల అనుమతులు తప్పనిసరి. చెరువుల్లో మట్టిని తవ్వుకోవాలన్నా పంచాయతీ తీర్మానంతోపాటూ మైన్స్, పర్యావరణ శాఖ నుంచి అనుమతులు పొందాలి. ఈ నిబంధనలు అమలు కావట్లేదు. అక్రమంగా తవ్విన మట్టిని ఇటుకల బట్టీలు, లేఅవుట్లకు తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని ప్రత్తిపాడు మండలం చిప్పలమెట్ట ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. (తరువాయి 2వ పేజీలో)

## విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్.. ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్‌ను విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే జోన్ ఏర్పాటు ద్వారా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని తెలిపారు. మంగళవారం విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్‌ను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస – ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగం ముఖచిత్రాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## హెల్మెట్ ధరిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం: అనిత



**అనకాపల్లి, పతాకం న్యూస్:** రోడ్డు ప్రమాదాలతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. రోడ్డు ప్రమాదాలపై ముందు జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలాగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. హెల్మెట్ ధరిద్దామని... ప్రాణాలు కాపాడుకుందాం అంటూ నినదించారు. మంగళ వారం పాయక రావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి అనిత పర్యటించారు.. రోడ్డు ప్రమాదాల నివారణపై అడ్డరోడ్డు నుంచి నక్కపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో అనిత పాల్గొన్నారు. సురక్షిత రోడ్లు.. సురక్షిత జీవితం అంటూ హెల్మెట్లతో ర్యాలీ తీశారు. హెల్మెట్ ధరిద్దాం– సురక్షితంగా పయనిద్దాం అంటూ అనిత నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం అనిత మాట్లాడారు. చాలామంది రూ.2 లక్షల విలువ గల బైక్‌ను వాడతారు గాని, హెల్మెట్‌ను మాత్రం ధరించరని చెప్పుకొచ్చారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. ప్రాణం చాలా విలువైనదని... ప్రాణం కన్నా ఏది ఎక్కువ కాదని అన్నారు.

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. అందుకు సంబంధించిన సిఫార్సులను న్యాయశాఖకు సుప్రీంకోర్టు కొలీజియం పంపింది. ఈ సిఫార్సులను ఆమోదం కోసం రాష్ట్రపతి వద్దకు న్యాయశాఖ పంపింది. ఈ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం తెలుపుతూ త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. ముగ్గురు జ్యుడీషియల్ అధికారులను న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తాజాగా నిర్ణయం తీసుకుంది. న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, సి.హెచ్. పురుషోత్తమ కుమార్‌లను నియమించాలని నిర్ణయించింది. దాంతో ప్రస్తుతం జ్యుడీషియల్ అధికారుల కేడర్‌లో ఉన్న ఈ ముగ్గురిని హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమోషన్ కల్పించనున్నట్లు అయింది.

### తమిళనాట రాజకీయ ఉత్కంఠ.. ప్రభుత్వ ఏర్పాటుకు

## విజయ్ ముందు మూడు మార్గాలు!



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్కంఠభరిత ఫలితాలు వెలువడ్డాయి. 234 స్థానాలున్న అసెంబ్లీలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించలేదు. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో నిలిచిపోయింది. దీంతో రాష్ట్రంలో హంగ్ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు టీవీకే మూడు ప్రధాన మార్గాలపై దృష్టి సారించి, రాజకీయ సమీకరణాలపై తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అత్యంత సులువైన మార్గంగా డీఎంకే కూటమిలోని చిన్న పార్టీల మద్దతును కూడగట్టడాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ కూటమిలో కాంగ్రెస్‌కు 5, వామపక్షాలకు 4, ఐయూఎంఎల్‌కు 2, వీసీకేకు 2 సీట్లు ఉన్నాయి. ఈ పార్టీల మద్దతు లభిస్తే, టీవీకే సులభంగా మెజారిటీ మార్కును దాటగలదు. ఇప్పటికే కాంగ్రెస్, వామపక్షాలు, పీఎంకే వంటి పార్టీలతో టీవీకే చర్చలు ప్రారంభించినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇక, రెండో ప్రత్యామ్నాయంగా డీఎంకే, ఏఐఏడీఎంకే కూటముల్లోని కొన్ని చిన్న పార్టీలను కలుపుకొని మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని టీవీకే భావిస్తోంది. ఈ ప్రణాళిక ప్రకారం టీవీకే (108), కాంగ్రెస్ (5), పీఎంకే (4), ఐయూఎంఎల్ (2), వీసీకే (2) పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. ఈ ఏర్పాటులో స్వల్ప మెజారిటీ ఉన్నప్పటికీ, మద్దతిచ్చే అన్ని పార్టీలకు కేబినెట్‌లో స్థానం కల్పించడం ద్వారా ప్రభుత్వాన్ని స్థిరంగా నడపవచ్చని టీవీకే నాయకత్వం యోచిస్తోంది. రాజకీయంగా అత్యంత కీలకమైన మూడో మార్గం ప్రధాన ప్రత్యర్థి అయిన ఏఐఏడీఎంకే నుంచి బయటి మద్దతు తీసుకోవడం. ఏఐఏడీఎంకేకు 47 మంది సభ్యుల (తరువాయి 2వ పేజీలో)

## నేను సీఎం పదవికి రాజీనామా చేయను... మేం ఓడిపోలేదు: మమతా బెనర్జీ



**కోల్‌కతా, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పూర్తిగా తిరస్కరించారు. తాను సీఎం పదవికి రాజీనామా చేయబోనని, తాము ఓడిపోలేదని అన్నారు. ఎన్నికల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఇది "ప్రజాస్వామ్య హత్య" అని ఆమె తీవ్రంగా వ్యాఖ్యానించారు. తాము ఈ ఫలితాలను చట్టబద్ధమైన ఓటమిగా అంగీకరించబోమని స్పష్టం చేశారు. కోల్‌కతాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ దాదాపు 100 స్థానాలను అక్రమంగా దొంగిలించిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్, కేంద్ర బలగాలు పక్షపాతంగా వ్యవహరించాయని, దాదాపు 90 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి కుట్రపూరితంగా తొలగించారని విమర్శించారు.




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఫలితాలు..

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పలు పార్శ్వాలను తడిమాయి. హెచ్చరికలు, సందేశాలూ ఇస్తున్నాయి. పశ్చిమబెంగాల్, అసోం, పుదుచ్చేరి.. మూడు రాష్ట్రాల్లో బిజెపి అధికారం చేజిక్కించుకోవడంతో దేశంలో మితవాద శక్తుల పెరుగుదలకు ఆస్కారం కలిగింది. ఇంకో వైపు పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాలలో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నికరంగా నిలబడి పోరాడుతున్న కేరళం, తమిళనాడు ప్రభుత్వాల ఓటమి ప్రజాస్వామ్య, ప్రగతిశీల ప్రజలకు ఆందోళన కలిగిస్తుంది. మరెక్కడా ఉనికిని పెంచుకోలేని కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు ఊతకర్రగా పని చేస్తుంది. అక్కడ బిజెపిని ఎదురొడ్డి సైద్ధాంతికంగా సవాల్ చేస్తున్న ఎల్‌డిఎఫ్‌పై కాంగ్రెస్ గెలవడం గమనార్హం. వామపక్షాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే కేరళంలో బిజెపి తన ప్రభావం చూపలేకపోయింది. మూడు సీట్లకే ఆ కూటమి పరిమితమైంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఈ తడవ ఓడిపోవడం లౌకిక, ప్రజాతంత్ర పోరాటాలకు ఎదురుదెబ్బ. కేంద్రంలోని బిజెపి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొని ప్రజల సంక్షేమం, హక్కుల కోసం ఎల్‌డిఎఫ్ సర్కార్ అవిరళ కృషి చేసింది. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచి రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో ముందుపీఠిన నిలబడింది. ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ గెలుపునకు బిజెపి సహకరించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ మంచి ఓటింగ్‌ను, సీట్లను లెఫ్ట్ పొందగలిగింది. తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఎవరు టివికెకి మద్దతిస్తారో త్వరలోనే తెలిసిపోతుంది. తాము బిజెపి సిద్ధాంతానికి వ్యతిరేకమని, ఇదే సమయంలో డిఎంకె తమకు రాజకీయ శత్రువని విజయ్ ఎన్నికల్లో ప్రకటించి ప్రచారం చేశారు. పలు ప్రజాకర్షక పథకాల హామీలూ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాటకు విజయ్ కట్టుబడి ఉండాలి. తమిళనాడులో డిఎంకె పరాజయం చెందగా, ఆ పార్టీ చీఫ్ ఎంకె స్టాలిన్ స్వయంగా ఓటమి పాలవడాన్ని బట్టి ఆయన ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను తెలుపుతుంది. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా గింజుకున్నా తమిళనాట ప్రాంతీయ ద్రవిడ పార్టీల ప్రాబల్యం ముందు నిలబడలేదని ఓటర్లు మరోసారి నిరూపితం చేశారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బిజెపి మత విద్వేషాలు రెచ్చగొట్టి మెజార్టీ మతం ఓట్లను సమీకరించడంలో సక్సెస్ అయింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. అసోంలో ఇటువంటి మతోన్మాద కుయుక్తులతోనే అధికారాన్ని బిజెపి నిలబెట్టుకుంది. కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్‌తో కలిపి అధికారాన్ని కాపాడుకుంది. తమిళనాడులో వామపక్షాలకు నాలుగు సీట్లు, బెంగాల్‌లో ఒక సీటు, గుర్తించదగిన ఓటింగ్‌ను సిపిఎం, వామపక్షాలు దక్కించుకున్నాయి. ఎన్నికల కమిషన్ (ఇసి), సహా కేంద్ర సంస్థల దుర్వినియోగం, డబ్బు, కండబలం, మద్యం ప్రవాహంలో సిపిఎం, వామపక్షాలు చూపించిన పెర్ఫార్మెన్స్ చెప్పుకోదగినది. ఈ ఎన్నికల్లో ఎస్.ఐ.ఆర్. అమలు ప్రతిపక్షాల ఓటమికి, బిజెపి గెలుపునకు దోహదపడినట్లు తెలుస్తోంది. తాజా ఎన్నికల ఫలితాల దన్నుతో బిజెపి, మితవాద శక్తులు మరింత విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. లౌకికవాద పరిరక్షణకు యావత్ దేశ ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన సమయమిది.

## హైవే విస్తరణలో ఇళ్లు కోల్పోయాం.. న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన



**లావేరు, పతాకం న్యూస్:** జాతీయ రహదారి విస్తరణలో మా విలువైన భూములను కోల్పోయామని, అయితే వారం రోజుల కిందట ఇళ్లు ఖాళీ చేయాలని ఇళ్లలో ఎవరూ లేని సమయంలో గోడలకు నోటీసులను అంటించారని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ మేరకు బుడుమూరు ఎస్సీ కాలనీకి చెందిన జరజాన అప్పన్న, దుంగ బావాజీ, కుప్పిలి రమణమ్మ, మన్యాన నాగ రాజు, మన్యాన అసిరమ్మ తదితరులు నోటీసులను చూపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తామంతా నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన వారమని, 2005లో బుడుమూరు వద్ద జాతీయ రహదారి పనులు చేపట్టగా ఆ సమయంలో ఇళ్లు కోల్పోయిన కొందరికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని, అయితే మా ఐదు కుటుంబాలకు అప్పట్లో ఎటువంటి పరిహారం చెల్లించలేదని వారు వాపోయారు. రోజు పనులు చేసు కుంటే కాని కుటుంబాలను పోషిం చుకునే పరిస్థితి లేదని, ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు మేము వ్యతి రేకం కాదని, ప్రభుత్వం, అధికారులు స్పందించి మాకు నష్టపరి హారం ఇవ్వడంతో పాటు గ్రామంలో వేరే చోట ఇళ్ల స్థలాలు ఇప్పించి ఆదుకోవాలని వారు కోరారు.

## మమత, స్టాలిన్ ఓటమిపై అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు జరగడం వల్లే ప్రతిపక్షాలు ఓటమి పాలయ్యాయని ఆయన విశ్లేషించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో సుమారు 31 లక్షల మంది ముస్లిం ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యాయని, ఇది మమతా బెనర్జీపై తీవ్ర ప్రభావం చూపిందని ఆరోపించారు. మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన భవానీపూర్ నియోజకవర్గంలో కూడా ఇదే తరహాలో ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. తమిళనాడులో కూడా ఇదే వ్యూహం అమలు జరిగిందని ఒవైసీ అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన కొళత్తూరులో ఓడిపోవడానికి ఓటర్ల గల్లంతు కూడా ఒక కారణమని ఆయన విశ్లేషించారు. కేవలం కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓటు హక్కును కాలరాయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన మండిపడ్డారు. ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియపై ప్రతిపక్షాలు సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయని, బీజేపీ విజయం వెనుక ఇటువంటి సాంకేతిక వ్యూహాలు ఉన్నాయని ఒవైసీ ఈ సందర్భంగా విమర్శించారు.

## బెంగాల్‌కు పరిశీలకుడిగా అమిత్ షా.. అస్సాంకు జెపి నడ్డాను నియమించిన బీజేపీ

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలో బిజెపి ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్ర పరిశీలకుడుగా బెంగాల్ కు అమిత్ షాను, సహ పరిశీలకుడిగా ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీని బిజెపి అధిష్టానం నియమించింది. అలాగే అస్సాంకు జెపి నడ్డాను, సహ పరిశీలకుడిగా హర్యానా సిఎం నయాబ్ సింగ్ సైనిని నియమించింది. బెంగాల్లో బిజెపి ఎమ్మెల్యేలు, అగ్రనేతలు అమిత్ షాను, మోహన్ చరణ్ తో సమావేశమై.. శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## విజయ్ ముందు మూడు మార్గాలు!

బలం ఉంది. ఆ పార్టీతో విస్తృత కూటమి కాకుండా కేవలం బయటి నుంచి మద్దతు తీసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఈ వ్యూహంలో భాగం. దీనివల్ల సంకీర్ణ ప్రభుత్వంలోని ఇబ్బందులు లేకుండా, అంతర్గత స్థిరత్వంతో పాలన సాగించవచ్చని టీవీకే భావిస్తోంది. అయితే, సైద్ధాంతికంగా భిన్న ధ్రువాలైన ఈ రెండు పార్టీల మధ్య ఈ ఏర్పాటు ఎంతవరకు సాధ్యమవుతుందనేది ఆసక్తికరంగా మారింది. రాబోయే కొద్ది రోజుల్లో తమిళ రాజకీయాలు ఏ దిశగా సాగుతాయో స్పష్టత రానుంది.

## ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది: చంద్రబాబు

నూతనంగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీ సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి.. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ రైల్వే జోన్ ఏర్పాటు దోహద పడుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 2026, జూన్ 1వ తేదీ నుంచి విశాఖపట్నం కేంద్రంగా జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస – ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర రవాణా రంగం ముఖచిత్రాన్ని మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన విశాఖపట్నం డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీ సీఎం ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి.. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ రైల్వే జోన్ ఏర్పాటు దోహద పడుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## ఎవడ్రా మమ్ములను ఆపేది..

పోలవరం కాలువ గట్టు, అసైన్డ్ భూమిల్లోని మట్టిని సైతం తవ్వేసి తరలిస్తున్నారు. గండేపల్లి మండలం రామేశ్వరంపేట మెట్ట తవ్వకాలు నిరంతరాయంగా సాగుతున్నాయి. అక్కడ ఉన్న కొండలు పూర్తిగా కరిగిపోయాయి. తుని నియోజకవర్గంలోనూ పోలవరం ఎడమ కాలువ మట్టిని. తుని, తొండంగి, కోటనందురు మండలాల్లోని చెరువుల్లో మట్టిని ఎటువంటి అనుమతులూ లేకుండానే అక్రమార్కులు తరలించేస్తున్నారు. అక్రమ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## శస్త్రచికిత్స తర్వాత తొలిసారి బయటకొచ్చిన పవన్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శస్త్రచికిత్స అనంతరం పూర్తిస్థాయిలో కోలుకున్నాక తొలిసారిగా మంగళవారం బయటకు వచ్చారు. ఇటీవల దివంగతులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు ఆయన నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లిన పవన్, భాస్కరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గత నెల 22న నాదెండ్ల భాస్కరరావు కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పవన్ కల్యాణ్ సైనస్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఆయన అంత్యక్రియలకు హాజరుకాలేకపోయారు. అయితే, వార్త తెలిసిన వెంటనే భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్‌లో పరామర్శించారు. తాజాగా ఆరోగ్యం కుదుటపడటంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం ఆయన నేరుగా సహచర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. చాలా రోజుల తర్వాత పవన్ కల్యాణ్ మళ్లీ సాధారణ స్థితిలో కనిపించడంతో జనసేన కార్యకర్తలు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేసిన కేంద్రం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** భారత ప్రభుత్వం రైల్వే రంగంలో కీలకమైన పరిపాలనా సంస్కరణలకు శ్రీకారం చుడుతూ "దక్షిణ కోస్తా రైల్వే" (సౌత్ కోస్ట్ రైల్వే) అనే కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారిక గెజిట్ ద్వారా ప్రకటించింది. రైల్వే చట్టం, 1989 కింద ఉన్న అధికారాలను వినియోగిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం 2026 జూన్ 1 నుండి అమల్లోకి రానుంది. ఈ కొత్త రైల్వే జోన్‌కు ప్రధాన కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉన్న ఈస్ట్ కోస్ట్ రైల్వే , సౌత్ సెంట్రల్ రైల్వే జోన్‌లలోని కొన్ని విభాగాలను పునర్వ్యవస్థీకరించి కొత్త జోన్‌ను రూపొందిస్తున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని గుంటకల్, గుంటూరు, విజయవాడ డివిజన్‌లను ఈ కొత్త దక్షిణ తీర రైల్వేలో చేర్చడం జరుగుతుంది. అలాగే ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్‌ను విభజించి, దాని ఒక భాగాన్ని విశాఖపట్నం డివిజన్‌గా మార్చి కొత్త జోన్‌లో విలీనం చేయనున్నారు. వాల్తేరు డివిజన్ విభజన ఈ పునర్వ్యవస్థీకరణలో కీలక అంశంగా నిలిచింది. ఈ డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించి, ఒక భాగాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వేలో కొనసాగిస్తూ "రాయగడ డివిజన్"గా కొత్తగా ఏర్పాటు చేస్తారు. మిగిలిన భాగాన్ని "విశాఖపట్నం డివిజన్"గా మార్చి దక్షిణ తీర రైల్వేలో చేర్చనున్నారు. ఈ రాయగడ డివిజన్ పరిధిలో కొరాపుట్--సింగపూర్ రోడ్, కొత్తవలస--కిరండుల్, కునేరు–థేరు వాలి, గుణుపూర్–పారలాఖేముండి వంటి ముఖ్యమైన రైల్వే మార్గాలు చేర్చబడతాయి. అదేవిధంగా విశాఖపట్నం డివిజన్ పరిధిలో ఇచ్ఛాపురం నుంచి పలాసా, విశాఖపట్నం, దువ్వాడ వరకు విస్తరించే ప్రధాన మార్గంతో పాటు విజయనగరం–కునేరు, నౌపాడ–పారలాఖేముండి, బొబ్బిలి–సాలూరు వంటి మార్గాలు ఉంటాయి. సింహాచలం నార్త్–దువ్వాడ బైపాస్, వడలపూడి–దువ్వాడ వంటి ఉప మార్గాలు కూడా ఈ డివిజన్‌లోకి వస్తాయి. మొత్తం మీద ఈ డివిజన్ సుమారు 463 కిలోమీటర్ల రైల్వే మార్గాన్ని కలిగి ఉంటుంది. నిర్వహణ , ఆపరేషన్ల సమన్వయాన్ని దృష్టిలో ఉంచుకొని కొన్ని రైల్వే మార్గాలను ఒక డివిజన్ నుండి మరొక డివిజన్‌కు మార్చడం జరుగుతుంది. ఖుర్దా రోడ్ డివిజన్ పరిధిలో ఉన్న పలాసా--ఇచ్ఛాపురం మార్గాన్ని విశాఖపట్నం డివిజన్‌కు బదిలీ చేయడం వంటి మార్పులు చేపట్టారు. అలాగే గుంటకల్, గుంటూరు, విజయవాడ , సికింద్రాబాద్ డివిజన్‌ల మధ్య కూడా కొన్ని మార్గాల పునర్విభజన జరుగుతుంది. దీనితో రైల్వే డివిజన్‌ల సరిహద్దులు కూడా కొత్తగా నిర్వచించబడతాయి. ఈ పునర్వ్యవస్థీకరణ ద్వారా రైల్వే పరిపాలనలో సమర్థత పెరగడంతో పాటు సేవల వేగం, నిర్వహణలో సమన్వయం మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకంగా అభివృద్ధి అవకాశాలు పెరిగి, విశాఖపట్నం ఒక ప్రధాన రైల్వే కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిర్ణయం రైల్వే రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావించబడుతోంది.

## పాలిసెట్-2026 ఫలితాలు విడుదల



**అమరావతి, పతాకం న్యూస్::** పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2026 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఉదయం ఎక్స్ వేదికగా .... మంత్రి లోకేష్ ఫలితాలు విడుదల చేశారు. పాలిసెట్‌కు మొత్తం 1,77,581 మంది దరఖాస్తు చేయగా, 1,63,008 మంది పరీక్ష రాశారు. వీరిలో 1,48,950 మంది అర్హత సాధించారు. పాలిసెట్‌లోనూ బాలికలే పైచేయి సాధించారు. 93.57 శాతం మంది అర్హత పొందారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 99.11 శాతం మంది అర్హత సాధించగా.. తర్వాతి స్థానాల్లో పోలవరం (95.46శాతం), పార్వతీపురం మన్యం (93.45 శాతం) నిలిచాయి.

## ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్టు.. 22.4 తులాల బంగారం రికవరీ



**నరసన్నపేట, పతాకం న్యూస్:** ఆ మహిళ తెలిసిన వారింటికి చుట్టపుచూపుగా వెళ్లేది. వారితో మాటలు కలిపి.. ఇంట్లో బంగారం ఆభరణాలపై కన్నేసేది. వారు ఇంట్లో లేని సమయంలో చోరీలకు పాల్పడుతుండేది. చివరకు రెండుచోట్ల జరిగిన చోరీ కేసుల్లో 22.4 తులాల బంగారు ఆభరణాలతో పోలీసులకు చిక్కింది. ఇందుకు సంబంధించి నరసన్నపేటలోని పోలీసుస్టేషన్‌లో టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'సారవకోట మండలం అవలంగి, బైదలాపురంలో ఇటీవల జరిగిన చోరీ కేసుల్లో ప్రధాన నిందితురాలు ముద్దాడ లక్ష్మీని అరెస్టు చేశాం. అవలంగికి చెందిన ముద్దాడ సురేష్, లక్ష్మీ దంపతులు కొన్నాళ్లుగా విశాఖపట్నంలో గృహ నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. లక్ష్మీ మార్చి 21న అవలంగి వచ్చింది. గ్రామంలో బంధువు ముద్దాడ గౌరినాయుడు ఇంటికి వెళ్లింది. ఆ కుటుంబ సభ్యులతో మాటామంతీ కలిపింది. ఎవరూలేని సమయంలో గౌరినాయుడు ఇంట్లోకి చొరబడి 13 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసింది. అలాగే గత నెల 21న లక్ష్మీ.. కన్నవారి గ్రామమైన బైదలాపురం వెళ్లింది. అక్కడ యాళ్ల రాము ఇంట్లో రాత్రివేళ చొరబడింది. నిద్రిస్తున్న రాము భార్య శకుంతుల, కుమార్తె పావని మెడలో 5 తులాల రెండు పుస్తెలుతాళ్లను దొంగించింది. మళ్లీ అవలంగి చేరుకుంది. గత నెల 26న గ్రామంలోని గుండ బోడేసు భార్య లక్ష్మీనారాయణ మెడలో రెండున్నర తులాల పుస్తెలతాడును దొంగిలించింది. బాధితుల ఫిర్యాదు మేరకు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేశారు. ఈ రెండు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన తీరును పరిశీలించి.. ఒక్క వ్యక్తియేనని నిర్ధారణకు వచ్చి ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ఈ రెండు గ్రామాలతో సంబంధం ఉన్న ముద్దాడ లక్ష్మీపై అనుమానంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈక్రమంలో చోరీకి పాల్పడిన బంగారం ఆభరణాలు విక్రయించేందుకు అవలంగి నుంచి బుడితి జంక్షన్ వద్ద పోలీసులు పరిశీలించి ఆరా తీశారు. చోరీల బండారం బయటపడింది. ఆమె నుంచి రూ.32 లక్షల విలువైన 22.49 తులాల బంగారం, వెండి ఆభరణాలను రికవరీ చేశాం. లక్ష్మీ విశాఖపట్నంలో ఎంవీపీ పోలీసుస్టేషన్ పరిధిలో కూడా చోరీకి పాల్పడింద'ని డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. కేసు ఛేధించిన సీఐ శ్రీనివాసరావును, ఎస్ఐలు అనిల్, ఆశోక్‌బాబు, రంజిత్, గణేష్‌తోపాటు హెచ్‌సీ కె.భాస్కరరావు, పీసీ జి.సత్యనారాయణ, దాలినాయుడును అభినందించారు.

## రూ.1.99 కోట్లతో నర్సీపట్నంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఆధునికీకరణ



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** మత్స్యశాఖ ఆధ్వర్యంలో గతంలో ఒక వెలుగు వెలిగిన చేప పిల్లల ఉత్పత్తి, పెంపకం కేంద్రానికి మళ్లీ మంచి రోజులు రానున్నాయి. సుమారు పదేళ్ల నుంచి నిర్వీర్యంగా పడివున్న ఈ కేంద్రం ఆధునికీకరణకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. సుమారు రెండు కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులతో చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురానున్నట్లు కలెక్టర్ ఇటీవల ప్రకటించారు. నర్సీపట్నం మత్స్య శాఖ ఏడీ కార్యాలయం ఆవరణలో చేపల పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. మొత్తం 23 తొట్లెల్లో చేప పిల్లలను ఉత్పత్తి చేసేవారు. వీటిని జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లలో వదిలేవారు. అయితే ఈ కేంద్రం రహదారికన్నా తక్కువ ఎత్తులో వుండడంతో డ్రైనేజీ కాలువ నీరు తొట్టెల్లోకి చేరుతున్నది. చేప పిల్లలను పెంచే కుండీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. దీంతో పదేళ్ల నుంచి చేప పిల్లల ఉత్పత్తిని ఆపేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ విజయకృష్ణన్ ఇటీవల నర్సీపట్నంలో పర్యటించారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. జలవనరు శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అంచనాలు తయారు చేయించారు. సుమారు రెండు కోట్ల రూపాయలు అవసరం అవుతాయని మత్స్యశాఖ అధికారులకు నివేదిక అందజేశారు. నర్సీపట్నం పర్యటనకు వచ్చిన కలెక్టర్ విజయకృష్ణన్.. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సీఎస్ఆర్ నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం వున్న 23 తొట్టెలను ఎత్తు చేయడంతోపాటు కొత్తగా మరో పది తొట్టెలు నిర్మిస్తారు. కార్యాలయం ఆవరణకు ప్రహరీ గోడ నిర్మించి, నీటి కోసం రెండు బోర్లు వేస్తారు. కాగా నర్సీపట్నం మత్స్యశాఖ ఏడీ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. కిటికీల రెక్కలు ఊడి పోయాయి. భవనం శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇంకా కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత జిల్లా మత్స్యశాఖ అధికారి పోస్టును మంజూరు చేశారు. ఎఫ్‌డీవో పోస్టులు ఐదింటికి రెండు ఖాళీగా ఉన్నాయి. ఫిషర్‌మెన్ పోస్టులు రెండు, సీనియర్ అసిస్టెంట్ ఒకటి, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు, టైపిస్ట్ పోస్టు ఒకటి ఖాళీగా వున్నాయి. నూతన భవనం నిర్మించడంతోపాటు ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం వుంది.

## మెడికల్ కాలేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలి



**అరకులోయ, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో మెడికల్ కాలేజీ పనులపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాలేజీలోని ప్రధాన భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాల్లోని ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, వినియోగంలోకి తీసుకుని రావాలన్నారు. మొత్తం నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడకుండా పటిష్టంగా నిర్మించాలన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏడీహెచ్‌వో టి.ప్రతాప్, ఏపీ ఎంహెచ్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అచ్చెంనాయుడు, డీఈఈ విజయభాస్కర్, ఎన్‌సీసీ ప్రతినిధి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత వాతావరణం పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. గత మూడు రోజులుగా జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు, పెదబయలు ఈదురు గాలులకు చెట్టుకూలి ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటనల నేపథ్యంలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలోని చింతపల్లి, జీకేవీధి మండలాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే ఇతర ప్రాంతాల్లో పడే సూచనల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఉరుములు, పిడుగులు పడే సమయాల్లో చెట్లకింద, విద్యుత్ స్తంభాలకు దూరంగా సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలన్నారు.

## మోదకొండమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలి: సంధ్యారాణి



**పాడేరు, పతాకం న్యూస్:** ఈ నెల 17, 18, 19 తేదీల్లో జరిగే మోదకొండమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో అధికారులు, ఉత్సవ, ఆలయ కమిటీల సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ స్టాళ్ల ఏర్పాటు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, రవాణా సౌకర్యాలు, భోజన వసతి సదుపాయాలు, ప్రజా మరుగుదొడ్ల ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, అగ్నిమాపక శకటాలు ఏర్పాటు, వైద్య సేవలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు తమ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యలు ఏర్పడకుండా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని, అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయాలన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రాకపోకలు సాగించేందుకు వంద వరకు ప్రత్యేక బస్సులను నడపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అధికారులు, ఉత్సవ కమిటీతో సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి చేయాల్సిన పనులను ఆయా శాఖల అధికారులు రూపొందించిన ప్రణాళికల ఆధారంగా చేపట్టాలన్నారు. ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వందలాది మంది సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామన్నారు. వాహనాల రాకపోలకు ఎటువంటి అవాంతరాలు లేకుండా చక్కని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవాలపై రూపొందించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, డీఆర్‌వో లోకేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు గిడ్డి ఈశ్వరి, ఆర్‌టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టూరిజం డైరెక్టర్ కేవీ రమేశ్‌నాయుడు, ట్రైకార్ డైరెక్టర్ కె.కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో జూనియర్ లైన్‌మన్ మృతి



**జామి,, పతాకం న్యూస్:** శాసనపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు స్తంభం ఎక్కిన జూనియర్ లైన్‌మన్ బుగత అప్పలరాజు(28) విద్యుదాఘాతంతో మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించి ఏఈ జ్యోతిష్యరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నంరాజుపేట గ్రామానికి చెంది న అప్పలరాజు వన్నె సచివాలయం పరిధిలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శాసనపల్లి గ్రామంలో విద్యుత్ లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అప్పలరాజు అక్కడకు చేరుకు న్నారు. స్థానికంగా ఉన్న ఎలక్ట్రీషియన్‌కు ట్రాన్స్ ఫార్మర్ ఆఫ్ చేయాలని చెప్పి ఆయన స్తంభం ఎక్కారు. ఎక్కిన తర్వాత విద్యుత్ తీగ తాకగానే ఒక్కసారిగా షాకుకు గురయ్యారు. వెంటనే విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మృతునికి భార్య, తల్లిదండ్రు లు ఉన్నారు. ఈ ఘటనపై జామి పోలీసులు కేసు నమోదు చేశారు.

## కార్ల్ మార్క్స్‌కు వామపక్ష నేతల నివాళి



**విజయవాడ, పతాకం న్యూస్:** మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, మహా ఆర్థికవేత్త, కామ్రేడ్ కార్ల్ మార్క్స్ 208వ జయంతి సందర్భంగా .... మంగళవారం విజయవాడ హనుమాన్ పేటలోని కార్ల్ మార్క్ -ఎంగేల్స్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, వి.ఉమామహేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, తదితర వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

## కూలి రేట్లు పెంచాలని ధర్నా?




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ విశాఖ పట్నం కలెక్టరేట్ ఎదుట ముఠా కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ.. నెలనెలా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత కూలి రేట్లు సరిపోవడం లేదని, ముఖ్యంగా కూరగాయలు, గ్యాస్, ఇంటి అద్దె, కరెంట్ బిల్లు, విద్యార్థుల స్కూల్ ఫీజులు, ఆస్పత్రి ఖర్చులు గణనీయంగా పెరగడంతో జీవన వ్యయం భారీగా పెరిగిందని తెలిపారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి కచ్చితంగా అగ్రిమెంట్లు జరిగేలా చూడాలని కోరారు. గ్రానైట్ పలకలకు సంబంధించి అడుగుకు గాజువాకలో రూ.5.50 ఇస్తున్నారని, అయితే విశాఖలో రూ.3.75 మాత్రమే ఇస్తున్నారని, గాజువాకలో ఇస్తున్న ధరను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలి రేట్లు పెంచే ప్రక్రియలో రెండు నుంచి మూడు నెలల ఆలస్యం అవుతోందని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పై సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కు కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.మన్మధరావు, ముఠా కార్మికులు రామన్న, నరసింహ, బాబు, చంద్రరావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

## మీ విజయం ఆనందాన్ని ఇచ్చింది: అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం పరధిలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన ఇంట్లో ప్రత్యేంగా విందు ఏర్పాటు చేసి వారితో కలిసి భోజనం చేశారు. పదో తరగతిలో 600 మార్కులకుగాను 580కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులు 11 మంది వున్నారు. స్పీకర్ వీరితో గ్రూప్ ఫొటో దిగి, ఏటికొప్పాక కళాకారులు తయారు చేసిన సరస్వతిదేవి బొమ్మలను జ్ఞాపికలుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించడం ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందని చెప్పారు. ఈ సంతోషాన్ని వారితో కలిసి పంచుకొని, భోజనం చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశానని తెలిపారు. బాగా చదువుకొని అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో స్థిరపడిన తెలుగువారు అనేకమంది ఉన్నారని గుర్తు చేశారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ పడవద్దని, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యేక కోచింగ్‌ను సద్వినియోగం చేసుకొని అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, అయ్యన్న కుటుంబ సభ్యులు పద్మావతి, డాక్టర్ సువర్ణ, రాజేశ్, దివ్యశ్రీ పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు బాలిక మృతి



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** ఆకు కూర సేకరణకు కొండకు వెళ్లిన ఒక బాలికపై పిడుగు పడడంతో మృతి చెందింది. దీనికి సంబంధించి బాలిక తండ్రి కోగేష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కంద్రుం పంచాయతీ సిందేరి గుడ గ్రామానికి చెందిన ఎస్.దివ్య(13) తన అక్క, స్నేహితురాలితో కలిసి కొంకోడి కూర (ఆకు కూర) సేకరణ నిమిత్తం కొండకు వెళ్లింది. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో తిరిగి ఇంటికి వస్తున్న దివ్యపై పిడుగు పడడంతో కుప్పకూలిపోయింది. ఆ బాలికను 108 వాహనంలో డుంబ్రిగుడ పీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దివ్య డుంబ్రిగుడలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. ఆ బాలిక మృతితో సిందేరిగుడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## క్వాంటమ్ కంప్యూటింగ్ పరీక్షలో ప్రతిభ





**చింతపల్లి, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గిరిజన విద్యార్థినులు క్వాంటమ్ కంప్యూటింగ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాకర్ ఎం. విజయభారతి తెలిపారు. ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాజాగా దేశవ్యాప్తంగా జరిగిన క్వాంటమ్ కంప్యూటింగ్ పరీక్షను స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు విశాఖపట్నంలో రాశారన్నారు. ద్వితీయ సంవత్సరం బీఏ విద్యార్థిని ఆర్.విమోచన, ప్రథమ సంవత్సరం బీఎస్సీ విద్యార్థినులు సీహెచ్. భవాని, వి.కృష్ణవేణిలు ఉత్తీర్ణులయ్యారన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ పరీక్షలో రాణించిన ఆ ముగ్గురు విద్యార్థునులను మంగళవారం విజయవాడ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో సత్కరించేందుకు ఏపీఎస్‌హెచ్ఈ నుంచి ఆహ్వానం అందిందని తెలిపారు. కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి క్వాంటమ్ కంప్యూటింగ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఆర్.రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

## చిన్నారి ప్రాణాలకు అండగా నిలవండి: మంత్రి శ్రీనివాస్




**విజయనగరం, పతాకం న్యూస్:** విజయ నగరం కోరుకొండకు చెందిన రెండు నెలల చిన్నారి కృష్ణకు సాయం అందించి, ప్రాణాలకు అండగా నిలవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వివిధ స్వచ్ఛంద, సేవా సంస్థలు, నగరంలోని ప్రముఖులతో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమావేశం నిర్వహించారు. చిన్నారి కృష్ణ ఆరోగ్య పరిస్థితి.. రూ.16 కోట్ల ఆర్థిక సాయంపై వివరించారు. ఇందుకోసం క్యూఆర్ కోడ్‌ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీనివాస్ తన వంతు సాయం కింద రూ.1లక్ష ప్రక టించారు. జిల్లాలోని అందరూ దీనిపై స్పందించాలని కోరారు. అదే విధంగా రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ సెంట్రల్, లయన్స్ క్లబ్, ఇన్నవీర్‌వీల్, డాక్టర్లు, మెసానిక్ టెంపుల్, క్షత్రియ పరిషత్‌తో పాటు పలువురు స్వచ్ఛందంగా తమ విరాళాలను క్యూఆర్ కోడ్ ద్వారా అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ సాయం అందించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారి కృష్ణకు మస్కులర్ అట్రోఫీ టైప్-1(ఎస్ఎంఏ) చికిత్స కోసం ఆర్థిక సాయం అందించడానికి అందరూ మానవతా దృక్పథంతో ముం దుకు రావాలని కోరారు. అనంతరం మంత్రి చిన్నారిని ఎత్తుకున్నారు. ఇటువంటి అరుదైన వ్యాధిని నయం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, ఈ విష యాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉందని, చిన్నారి ప్రాణాలకు ఎలాంటి భయం ఉండదని ఆయన చిన్నారి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీవో ఆర్.వైశాలి, డీఆర్వో కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ దిలీప్ చక్రవర్తితో కలిసి ఆయన ప్రజల నుంచి 52 వినతులను స్వీకరించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని, పార్వతీపురం మండలం లోని అడారు పాఠశాలలో టేకు చెట్లను అక్రమంగా నరికిన వారిపై చర్యలు తీసుకోవా లని ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే రెవెన్యూ క్లినిక్‌కు 20 వినతులు అందాయి.

## జిందాల్ మోసాలపై మౌనమెందుకు?: ఎమ్మెల్సీ రఘురాజు



**ఎస్.కోట, పతాకం న్యూస్:** బొడ్డవర ప్రాంతంలో జిందాల్ పరిశ్రమ చేస్తున్న భూ దోపిడీలు, డీపట్టా భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆధారాలతో సహా చూపిస్తున్నా అధికారులు ఎందుకు మౌనం వహి స్తున్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురా జు ప్రశ్నించారు. బొడ్డవర గ్రామంలోని తన స్వగృ హంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వ హించి.. మాట్లాడారు. జిందాల్ యాజమాన్యం వద్ద ఎంతభూమి ఉందో సర్వేచేసి చెప్పా లని ఎన్నో నెలలుగా కోరుతున్నా అధికార యంత్రాంగం చెప్పడం లేదన్నారు. ప్రభుత్వ అధికారుల అండదండలతో డీపట్టాలు కాస్తా జిరాయితీలుగా మారి రిజిస్ట్రేషన్లు జరిగాయని తాము ఆధారాలతో చూపించినా కలెక్టర్ ఎందుకు స్పం దించలేదని ప్రశ్నించారు. అదేవిధంగా మిలటరీ పట్టాల పేరుతో సంబంధిత వ్యక్తులు ఎటువంటి ధ్రువపత్రాలు ఇవ్వకపోయినా వారికి అధిక మొత్తంలో పరి హారం అందిందని, ఇందులో కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు. జాతీ య ఎస్టీ కమిషన్ సభ్యుడు జర్రోతు హుస్సేన్ నాయక్ విచారణకు రావాలని ఆదే శాల మేరకు హైదరాబాద్‌లో రైతులతో తాను విచారణకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ విచారణకు ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్, ఎస్పీని హాజరు కావాలని కమిషన్ సమన్లు పంపిందన్నారు.

## అనంతబాబును కస్టడీలోకి తీసుకున్న పోలీసులు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత, ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు ఈరోజు తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి ఆయనను భారీ భద్రత నడుమ కాకినాడకు తరలించారు. ఈ ప్రయాణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతబాబును ఒక్కరోజు కస్టడీలోకి తీసుకునేందుకు కోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌లో అనంతబాబును ప్రత్యేక బృందం విచారిస్తోంది. ముఖ్యంగా హత్య జరిగిన రాత్రి అసలేం జరిగింది? సుబ్రహ్మణ్యాన్ని ఇంటి నుంచి ఎందుకు తీసుకెళ్లారు? హత్యకు దారితీసిన అసలు కారణాలు ఏంటి? అనే కీలక అంశాలపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. సాక్షులను బెదిరించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది. కస్టడీ ముగిసిన అనంతరం సేకరించిన సమాచారాన్ని పోలీసులు న్యాయస్థానానికి సమర్పించనున్నారు.

# అట్టహాసంగా శేషగిరి విజ్ఞాన కేంద్రం ప్రారంభం



**విజయనగరం, పతాకం న్యూస్:** స్థానిక కె ఎల్ పురంలో నిర్మించిన శేషగిరి విజ్ఞాన కేంద్రం మంగళవారం వేలాదిమంది ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు నాయకులు మధ్య అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. యు టి ఎఫ్ జిల్లా కమిటీ నూతనంగా నిర్మించిన భవనాన్ని యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్ ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సభ గ్రౌండ్ ఫ్లోర్ లో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. రెండవ అంతస్తులో సమావేశం హాల్ ను శేషగిరి తల్లి కోరాడ్ల సూర్యకాంతం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అదే విధంగా యు టి ఎఫ్ కార్యాలయాన్ని రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, గెస్ట్ హౌస్ రూములను యు టి ఎఫ్ సీనియర్ నాయకులు డి.రాము తదితరులు రిబ్బన్ కట్ ప్రారంబించారు. అనంతరం సభ ప్రారంభానికి ముందు శేషగిరి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు,యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్ ప్రసాద్, శేషగిరి తల్లి సూర్యకాంతం,కుటుంబ సభ్యులు,యు టి ఎఫ్ నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతా భాస్కరరావు అధ్యకతన జరిగిన సభ లో భవనాన్ని ప్రారంభించిన యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ .. శేషగిరి విజ్ఞాన కేంద్రం ప్రశ్నించే గొంతులకు కేంద్రంగా ఉండాలన్నారు. ఉద్యమ అవసరాలు కోసం రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద భవనమన్నారు. సంఘం ఉద్యమ అవసరాలు కోసమే కాదు ప్రజలు అవసరాల కోసం,ప్రజా సంక్షేమం కోసం నిర్మించిన భవనం అన్నారు. అనేక విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రంలో ఉన్నాయి అవి ఏవీ ఉపాధ్యాయులు నిర్మించినవి కాదు, ఉపాధ్యాయులు నిర్మించిన ఏకైక విజ్ఞాన కేంద్రం శేషగిరి విజ్ఞాన కేంద్రం అన్నారు. ప్రజలందరికీ నాయకుడు శేషగిరి అన్నారు. విద్యార్ధి,యువజన,కార్మిక,ప్రజా పోరాటాల్లో శేషగిరి ఉన్నారన్నారు. యు టి ఎఫ్ ఆశయాలను ఆచరణలో నిరూపించిన వ్యక్తి శేషగిరి అన్నారు. ఈ విజ్ఞాన కేంద్రం అన్ని వర్గాలు ప్రజలు కోసం ఉపయోగపడాలన్నారు.

## పెద్దగెడ్డ జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా సాగునీరు అందించే పనులకు అడ్డంకులు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో పెద్దగెడ్డ జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా సాగునీరు అందించే పనులకు అవాంతరాలు వీడడం లేదు. ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇప్పటికి నాలుగుసార్లు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఈ పైలెట్ ప్రాజెక్టు పట్టాలెక్కడం లేదు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా మోడర్నైజేషన్ ఆఫ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ పైలెట్ ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాను ఎంపిక చేశాయి. అయితే టెండర్ల ప్రక్రియలో కాంట్రాక్టర్లు పాల్గొనలేకపోవడంతో పనులకు మోక్షం కలగడం లేదు. వాస్తవంగా పాచిపెంటలో ఉన్న పెద్దగెడ్డ జలాశయం నుంచి పాచిపెంట మండలం, విజయనగరం జిల్లాలోని రామభద్రపురం మండలంలో 7,500 ఎకరాలకు పైపులైన్ ద్వారా సాగునీరు అందించాలని నిర్ణయించారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. జీఎస్టీతో కలిపి రూ.73.50 కోట్ల అడ్మినిస్ట్రేటివ్ ఆమోదంతో టెండర్లను పిలిచారు. కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతంతో కలిపి.. సుమారు రూ.56 కోట్ల విలువైన పనులను చేపట్టాల్సి ఉంది. అయితే కొన్ని నెలలుగా ఇరిగేషన్, ఇంజనీరింగ్ శాఖాధికారులు టెండర్లను పిలుస్తున్నా ఫలితం ఉండడం లేదు. తొలుత మూడు సార్లు టెండర్లు పిలిచినా .. ఒక్క కాంట్రాక్టర్ కూడా పాల్గొనలేదు. నాలుగోసారి మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక కాంట్రాక్టర్ పాల్గొన్నారు. అయితే రూ. 56 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు గాను సుమారు 26 శాతం అధిక రేట్లకు టెండర్ వేశారు. దీంతో ఇరిగేషన్ శాఖాధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పైలెట్ ప్రాజెక్టు పనుల అంచనా విలువకు ఐదు శాతం వరకు మాత్రం అధికంగా టెండర్లు ఖరారు చేసే అవకాశం ఉంటుంది. అంతకంటే ఎక్కువ శాతం ఉంటే.. టెండర్లు ఖరారు చేసే పరిస్థితి లేదు. దీంతో ఐదోసారి టెండర్లను పిలిచేందుకు ఇరిగేషన్, ఇంజనీరింగ్ శాఖాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే ఈ పనులు ఎవరు దక్కించుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది. సాగునీరు సరఫరాకు సంబంధించి సుమారు 18 కిలోమీటర్ల మేర పైపులు వేయాల్సి ఉంది. అయితే పశ్చిమాసియాలో తాత్కాలికంగా యుద్ధం ఆగినా.. పైపులు మాత్రం ధరలు అధికంగా పెరగడంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర కాంట్రాక్టర్లకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో వారు టెండర్లు వేసేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది. ఏదేమైనా దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు.

## విజయ్ పార్టీకి, మాకు ఓట్ల వ్యత్యాసం 3.52 శాతమే: డీఎంకే చీఫ్ స్టాలిన్



**చెన్నై, పతాకం న్యూస్:** విజయ్ టీవీకే పార్టీకి, తమకు మధ్య ఓట్ల వ్యత్యాసం 3.52 శాతమేనని డీఎంకే పార్టీ అధినేత, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా కార్యకర్తలను, ప్రజలను ఉద్దేశించి సందేశం పంపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమి అభ్యర్థులకు ఓటువేసిన వారందరికీ మొదట ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమకు పడిన ప్రతి ఓటు అమూల్యమైనదని, తమపై ఉంచిన విశ్వాసానికి గుర్తుగా భావిస్తున్నామని అన్నారు. డీఎంకే కూటమి 1 కోటి 54 లక్షల 82 వేల 782 ఓట్లు సాధించిందని తెలిపారు. ఫలితాల్లో తమకంటే ముందున్న పార్టీ డీఎంకే కంటే కేవలం 17.43 లక్షల ఓట్లను మాత్రమే ఎక్కువగా పొందిందని విజయ్ పార్టీ టీవీకేను ఉద్దేశించి అన్నారు. ఫలితాల్లో ముందున్న పార్టీకి, తమ పార్టీకి ఓట్ల వ్యత్యాసం కేవలం 3.52 శాతమేనని తెలిపారు. అంతిమంగా తమిళనాడు ప్రజలు తమపై ఉంచిన నమ్మకం చాలా బలమైనదని అన్నారు. మాకు ఓటువేసి గెలిపించిన ప్రజల వద్దకు నేరుగా వెళ్లి కృతజ్ఞతలు తెలియజేస్తుంటామని, కాబట్టి గెలిచిన పార్టీ అభ్యర్థులు ప్రజలను నేరుగా కలవాలని సూచించారు. మనం పార్టీని నడుపుతున్నదే ప్రజల కోసమని, వారి కోసమే మనం రాజకీయాల్లో ఉంటున్నామని పేర్కొన్నారు. కాబట్టి అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి కృతజ్ఞతలు తెలియజేయడం కర్తవ్యంగా భావించాలని అన్నారు. డీఎంకే రాష్ట్రంలో ఆరుసార్లు అధికారంలో ఉందని గుర్తు చేశారు. ఇన్నేళ్ల రాజకీయంలో తాము చూడని విజయం లేదన్నారు.

## సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి



**సీతంపేట, పతాకం న్యూస్:** సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులు, వాంతులు వంటి లక్షణాలతో గిరిజనలు ఏరియా ఆసుపత్రిని ఆశ్రయించారు. ఓపీ 293వరకు నమోదు కాగా వీరిలో 46మంది వరకు వైరల్ జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరి చికిత్సపొందుతున్నారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారు. వైరల్ జ్వరాలతో బాధపడుతున్న రోగులు ఓపీ, రక్తపరీక్షల కోసం గంటల తరబడి ఆసుపత్రిలో ఉన్న మెట్లపై కూర్చుని నిరీక్షించారు. దీనిపై ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డీవీ శ్రీనివాస్ వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా ఏరియా ఆసుపత్రికి వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువగానే వచ్చాయన్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు.

## బాధితులకు సత్వర న్యాయం జరగాలి: ఎస్పీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీస్ అధికారులు నిబద్ధతతో వ్యవ హరించి బాధితులకు చట్టపరి ధిలో సత్వరం న్యాయం అందించాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదికను నిర్వ హించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 79 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించి వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ ఎస్‌లో వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కా రంపై ఎప్పటికప్పుడు కేసుల పురోగతిని జిల్లా కార్యాల యానికి అందజేయాలని సూచించారు.

## బెంగాల్‌లో కొలువుదీరనున్న బీజేపీ ప్రభుత్వం



**కోల్‌కతా, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన బీజేపీ... ప్రభుత్వ ఏర్పాటుకు ముహూర్తాన్ని ఖరారు చేసింది. నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా మే 9వ తేదీన నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వెల్లడించారు. ఠాగూర్ ఆశీస్సులతో రాష్ట్రంలో ఒక నూతన శకాన్ని ప్రారంభించాలనే ఉద్దేశంతోనే ఈ తేదీని ఎంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈరోజే ఎన్నికల ఫలితాలకు సంబంధించిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ అధికారులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అందజేయనున్నారు. రేపు సీఈసీ ఈ పత్రాలను గవర్నర్ ఆర్.ఎన్.రవికి సమర్పించనున్నారు. అనంతరం రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీని రాజీనామా చేయాల్సిందిగా గవర్నర్ ఆహ్వానిస్తారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే వరకు మమతా బెనర్జీ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా తన విధులను కొనసాగిస్తారు. ప్రభుత్వ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైనప్పటికీ, బెంగాల్ పీఠాన్ని అధిరోహించబోయే ఆ 'కీలక నేత' ఎవరనే దానిపై బీజేపీ అధిష్ఠానం ఇంకా రహస్యాన్ని మెయింటైన్ చేస్తోంది. మరో రెండు రోజుల్లో ఈ ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది. సీఎం రేసులో సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో సీఎం మమతా బెనర్జీని నందిగ్రామ్ లో ఓడించిన సువేందు.. ఈసారి ఎన్నికల్లో ఆమెను భవానీపూర్ లోనూ చిత్తు చేశారు.

## గుంటూరు ఛానల్ ఆధునీకరణకు రూ. 369.20 కోట్లు



**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు ఛానల్ ఆధునీకరణ, పొడిగింపు పనులకు ఎట్టకేలకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 జనవరిలో రూ.274.53 కోట్ల అంచనాలతో ఈ పనులకు అప్పటి టిడిపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా గత ఏడేళ్ల కాలంలో ఇందుకు సంబంధించిన పనులేమీ జరగలేదు. 2019 మే లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పనుల గురించి పట్టించుకోలేదు. 2023లో భూసేకరణ చేపట్టినా పూర్తి కాలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన అంచనాలతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపగా రూ.369.20 కోట్లు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది. తాడేపల్లి మండలం ఉండవల్లి నుంచి వట్టిచెరుకూరు మండలం గారపాడు వరకు ఉన్న ప్రస్తుత ఛానల్‌ను బాపట్ల జిల్లా పర్చూరు వరకు పొడిగించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న 47 కిలోమీటర్ల నుంచి 75 కిలో మీటర్ల వరకు పొడిగింపు, ఛానల్ ఆధునీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. తద్వారా 48 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు లభిస్తుంది. నిధుల కోసం రెండేళ్లుగా టిడిపి కూటమి ప్రభుత్వానికి వినతులిచ్చి నిధులు మంజూరుకు కృషి చేశామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు, డి.నరేంద్రకుమార్ మీడియాకు తెలిపారు. మంగళగిరి, పొన్నూరు. ప్రత్తిపాడు, పర్చూరు, చిలకలూరిపేట నియోజకవర్గాలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరమని వారు చెప్పారు.

## విలేకరిపై దాడిని వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల నిరసన



**అనంతపురం, పతాకం న్యూస్:** మనం విలేకరిపై దాడిని వ్యతిరేకిస్తూ .... ఉదయం పామిడి విలేకరులు తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు షర్మిలకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ లు రాఘవేంద్రప్ప, రవి కు ఫిర్యాదుపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులు మాట్లాడుతూ .... ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సమాజానికి మంచిది కాదన్నారు. వార్త రాసినందుకు విలేకరి ఇంటికి వెళ్లి దాడి చేయడమే కాకుండా బలవంతంగా కాళ్లు మొక్కించుకున్నట్లు వీడియోలో స్పష్టంగా ఉందన్నారు. ఈ ఘటనపై జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి అన్నారు. వార్తపై అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా వెళ్లాలని భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని ఇలాంటి చర్యలను విలేకరులుగా తాము ఖండిస్తున్నామన్నారు. నిజాయితీగా పనిచేస్తూ విధులు నిర్వహిస్తున్న విలేకరిపై ఇలాంటి దాడులు మంచి పద్ధతి కాదని చెప్పారు. విలేకరిపై దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, పాత్రికేయుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు కృష్ణారావు,దేవరపల్లి గోపాల్, భీమ, మురళి, మల్లికార్జున, శ్రీధర్, కాలాపురం నాగరాజు, సుబ్బు, నాగరాజు, నరేష్, మహమ్మద్ రఫీ,శీన, శివ, కిరణ్, అబ్రహం, సాయి, కమ్మిరెడ్డి, కృష్ణ, కుల్లాయి, వీర, తదితరులు ఉన్నారు.

## ఆదిత్యుని సేవలో మంత్రి అచ్చెన్న దంపతులు



**అరసవల్లి, పతాకం న్యూస్:** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చిన మంత్రి దంపతులను అర్చకులు, అధికా రులు ఆలయ మర్యాద లతో స్వాగతం పలికారు. అనంతరం వారి పేరున అర్చకులు విశేష పూజ లు చేశారు. అనంతరం అనివెట్టి మండపంలో వేద పండితులు వేదాశీ ర్వచనం చేశారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదా లను ప్రధాన అర్చ కుడు ఇప్పిలి శంకర శర్మ అందించారు. అలాగే దివంగత కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నా యుడు కుమార్తె, రాజమండ్రి సిటీ మాజీ ఎమ్మెల్యే భవాని.. కుమారుడితో కలిసి స్వామిని దర్శించుకున్నారు. సూర్యనమస్కార పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.

## టివికెతో చర్చలు జరపనున్న కాంగ్రెస్

**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడులో టివికె పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. 108 స్థానాల్లో గెలిచినప్పటికీ మెజార్టీ మార్క్‌కు 10 సీట్లు తక్కువగా ఉన్నాయి. దీంతో ఏదో ఒకపార్టీతో టివికె జతకట్టాలి. ఈ నేపథ్యంలో టివికెతో పొత్తుపెట్టుకోవడానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ఈ మేరకు సంకేతాన్ని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ వెల్లడించారు. టివికెతో కాంగ్రెస్‌తో చర్చలు జరుపుతుందని ఆయన మంగళవారం మీడియాకు లీకేజీలిచ్చారు. కాగా, కె.సి వేణుగోపాల్ అలప్పుజాలో మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికల్లో డిఎంకెతో కలిసి మేం పోటీ చేశాం. కానీ ఇప్పుడు తమిళనాడులో కొత్త పరిస్తితి తలెత్తింది. ఈ సమయంలో కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల అనంతరం తలెత్తిన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటుంది' అని ఆయన అన్నారు.

# అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో ప్రాంతీయ భూ సమీకరణ



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతి ఎకనామిక్ రీజియన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మరో అతిపెద్ద భూ సమీకరణకు సిద్ధమైంది. 44,962 చదరపు కిలోమీటర్ల (1,12,40, 500 ఎకరాల) పరిధిలో పరిశ్రమల ఏర్పాటు, గృహ నిర్మాణం పేరుతో అవసరమైన చోట్ల భూ సమీకరణ చేయనుంది. తొమ్మిది జిల్లాల పరిధిలో ఏర్పాటు చేయనున్న ఈ రీజియన్లో తొలిదశలో అభివృద్ధికి అవసరమైనవంటూ 10 నుండి 12 అంశాలను గుర్తించనున్నారు. నీతిఅయోగ్ రూపొందించిన సిటీ ఎకనామిక్ రీజియన్ (సిఇఆర్) ప్లాను నిబంధనలకు అనుగుణం గా విధివిధానాలు తయారు చేయనున్నారు. దీనికి అవసరమైన నివేదికను తయారు చేసేందుకు వీలుగా వ్యూహాత్మక కన్సల్టెన్సీని ఎంపిక చేసేందుకు ఆహ్వానించిన ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లో అనేక కీలక అంశాలు పొందుపరిచారు. రీజియన్ పరిధిలో కనీసం ఎనిమిది భారీ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుల కోసం అంతర్జాతీయ బ్యాంకులు, పెట్టుబడిదారులకు ఆమోదయోగ్యమైన రీతిలో 'బ్యాంకబుల్ ప్రీ -- ఫీజిబిలిటీ నివేదిక' రూపొందించనున్నారు. దీనిలో భాగంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక పెట్టుబడి అవసరాలను అంచనా వేస్తారు. ఇందులో భూమి వినియోగాన్ని కీలకంగా పేర్కొన్నారు. ప్రాజెక్టుల ఏర్పాటు కోసం కొత్తగా భూములు గుర్తించడం, ఇప్పటికే ఉన్న ల్యాండ్ బ్యాంకుతోపాటు, భూసమీకరణ పద్ధతులు అనుసరించనున్నారు. గతంలో పారిశ్రామిక ప్రాంతాల కోసం సేకరించిన భూమిని వినియోగించడానికి వీలుగా ప్లాను రూపొందించనున్నారు. వీటన్నిటికంటే ముఖ్యంగా 'రీజినల్ ల్యాండ్ పూలింగ్- విధానాన్ని రూపొందించాలని నిర్ణయించారు. అందులోనూ పట్టణ ప్రాంత విస్తరణ కీలకంగా ఉండాలనీ, ఆర్థిక అవసరాలు తీర్చేలా భూమి వినియోగ పద్ధతులు రూపొందించాలని సూచించారు.

నూతన రీజియన్ పరిధిలో అమరావతి రాజధాని నగరంగా, విజయవాడ-గుంటూరు పారిశ్రామిక సేవల జంట నగరాలుగా, ఏలూరు, బాపట్ల వ్యవసాయ పారిశ్రామిక కేంద్రాలుగా, ఒంగోలు మార్కాపురం ఖనిజ ఉత్పత్తి కారిడార్‌గా అభివృద్ధి చేయనున్నారు. మూడు దశల్లో అభివృద్ధి చేయనున్న రీజియన్ ప్లాను కోసం సింగపూర్, గ్రేటర్ టోక్యో, సియోల్ అనుభవాలను పరిశీలించాలని తెలిపారు. కేంద్రం సిటీ ఎకనామిక్ రీజియన్ల కోసం రూ.5000 కోట్లు కేటాయించిన నేపథ్యంలో నిధులు రాబట్టుకోవడం రీజియన్ ఏర్పాటులో కీలకమని ఆర్ఎఫ్పిలో పేర్కొన్నారు. అమరావతి ఆర్థిక రీజియన్లో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల మార్కాపురం జిల్లాలున్నాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో సుమారు 35.15 శాతం వాటాను ఈ ప్రాంతం కలిగి ఉంది. ఇందులో అమరావతి రాజధాని చుట్టూ భూ సమీకరణ ఆధారిత అభివృద్ధి ప్లానుతోపాటు చెన్నై -- కోల్‌కతా జాతీయ రహదారి, ప్రతిపాదిత అమరావతి -- అనంతపురం ఎక్స్‌ప్రెస్‌వే, విజయవాడ-హైదరా బాద్ కారిడార్ తోపాటు విస్తృతమైన రైల్ మార్గం ఉందని పేర్కొన్నారు. వీటికితోడు కృష్ణపట్నం - మచిలీపట్నం - రామాయపట్నం - కాకినాడ క్లస్టర్, ఓడరేవు ఆధారిత పారిశ్రామిక ప్రాంతాలు ఉన్నాయని, సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా ఉందని వీటిన్నిటినీ ఉపయోగించుకునేలా నూతన ప్లాను రూపొందించాలని పేర్కొన్నారు. వచ్చే దశాబ్దకాలంలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్లు, సెమీకండక్టర్ డిజైన్, ఎలక్ట్రిక్ వాహన భాగాలు, ఫార్మా, టెక్స్‌టైల్స్, డిఫెన్స్, ఏరోస్పేస్ , గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ప్రాంతీయ వృద్ధికి కీలకం కానున్నాయని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల నుండి ఆదాయం ఎక్కువ వస్తున్నా విస్తరించలేదని, నూతన ప్లానులో పట్టణ ప్రాంతాల విస్తరణకు ప్రాముఖ్యత ఇవ్వాలని తెలిపారు. ఇందులో పరిశ్రమలతోపాటు గృహ నిర్మాణానికి వీలుగా ప్లాను ఉండాలని తెలిపారు. జిల్లా స్థాయి ఆర్థిక ప్రత్యేకతలు, వృద్ధి కేంద్రాలు కారిడార్లను గుర్తించనున్నారు. గ్రామీణ పట్టణ శివారు ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలపరిచేలా ప్రాంతీయ ఆర్థిక వ్యూహాలను రూపొందించనున్నారు.

పెట్టుబడులకు అనువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల (పారిశ్రామిక /లాజిస్టిక్స్ /పట్టణ/ సామాజిక) జాబితాను స్థల సేకరణ, ఆర్థిక అంశాలను సిద్ధం చేయనున్నారు. పెట్టుబడులకోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక (1-22 ఏళ్లు) నిధుల సమీకరణ ప్లాను రూపొందించ నున్నారు.బిదీనికోసం తొమ్మిది రంగాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నారు. రాబోయే అరవై సంవత్సరాల్లో భారీ, రంగాలవారీ పరిశ్రమలు, పట్టణ సదుపాయాల కల్పన ఏర్పాటుకు ప్లానులో ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.


# అందుబాటులోకి ఖమ్మం--దేవరాపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే..

**ఖమ్మం, దేవరాపల్లి, పతాకం న్యూస్:** ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేను 2018లో రూ.ఆరువేల కోట్ల వ్యయంతో ప్రారంభించారు. ఎట్ట కేలకు ఎనిమిదేళ్ల తర్వాత అతిపెద్ద రవాణా మార్గం అందు బాటులోకి వచ్చింది. ఈ హైవేతో హైదరాబాద్--విశాఖ మధ్య 56 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచి సూర్యాపేట,విజయవాడ, ఏలూరు, దేవరపల్లి మీదుగా వైజాగ్‌కు 365 బీబీ ఎక్స్‌ప్రెస్ హైవే ఉంది. తాజాగా హైదరా బాద్ నుంచి సూర్యాపేట, ఖమ్మం నుంచి వైరా మీదుగా చింతలపూడి నుంచి దేవరపల్లి వరకు 365 బీజీ గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ ఈ హైవే 365 బీబీ హైవేలో అనుసంధానం అవుతుంది. ఖమ్మం, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల అనుసంధానికి ఇది ఉపయోగ పడనుంది. వాహనాల్లో సరుకులు, బొగ్గు, కలప, గ్రానైట్, ఇతర ఉత్పత్తుల రవాణాకు మార్గం అనుకూలంగా మారనుంది. ఏజెన్సీలోని జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి వివిధ ఉత్పత్తులను తరలించడానికి ఈ హైవే మరింత వెసులు బాటు కల్పించనుంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిడివి 162 కిలోమీటర్లు కాగా జిల్లాలో 72.29 కిలోమీటర్ల మేర ఈ రహదారి మీదుగా ప్రయాణాలు సాగుతాయి. జిల్లా పరిధిలో రూ.300 కోట్లు వెచ్చించి 24 గ్రామాల నుంచి 466.76 హెక్టార్ల భూమిని విస్తరణకు వాడారు. ఈ హైవే తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్, పోలవరం ప్రాజెక్టులను క్రాస్ చేస్తూ సాగుతోంది.జిల్లాలో



రాఘవాపురం, పొంగుటూరు (ఏడువాళ్లపాలెం) వద్ద హైవేపై వాహనాల నిలుపుదలకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఫుడ్ ప్లాజాలు, ఫస్ట్ ఎయిడ్, విశ్రాంతి గదులు, ఇతర ఏర్పాట్లు చేశారు. కొన్ని రోజులుగా ఈ రహదారిపై వాహనాల రాకపోకలు సాగుతున్నప్పటికీ.. తాజాగా పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ఫాస్ట్‌ట్యాగ్ రూపంలో టోల్ రుసుం వసూలు చేస్తున్నారు. ఈ హైవేపై ఎక్కడ ప్రవేశించి.. ఎక్కడ నిష్క్రమించిన ఒకటే టోల్‌ఫీజును నిర్ధారించారు. కాగా ఖమ్మం పరిధిలో ఈ హైవే నిర్మాణ పనులు ఇంకా కొన్నిచోట్ల తుది దశలో ఉన్నాయి. గ్రీన్‌ఫీల్డ్ ప్రారంభోత్సవానికి ముందు జరిగిన కొన్ని ప్రమాద సంఘటనలపై యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు జిల్లా పరిధిలో ఈ హైవేపై అయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్ఐలు పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు, స్థానిక తహసీల్దార్లు, ఆర్డీవోలు, డీఎస్పీలు నిఘా ఉంచుతారు. జేసీ అభిషేక్ గౌడ ఈ మేరకు పర్యవేక్షించనున్నారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు వెళ్లే ఈ హైవేపై 14 చోట్ల ఎంట్రీ (ప్రవేశం), ఎగ్జిట్ (నిష్క్రమణ)ల ప్రదేశాల ఏర్పాటు ఉంది. ఏలూరు జిల్లాలో చింతలపూడి మండలం రేచర్ల వద్ద, జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం వద్ద, కొయ్యలగూడెం మండలం పొంగు టూరు వద్ద ఎక్స్‌ప్రెస్ వేకు మార్గాలున్నాయి. సీసీ కెమెరాలు, సోలార్ ప్యానెళ్లు, సమాచారాన్ని అందించే క్యూఆర్ కోడ్‌లు, ఎమర్జెన్సీ ఓపెనింగ్స్, అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఈ హైవేపై 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా కనీస లిమిట్‌ను నిర్ధారించారు. ఈ ఎక్స్‌ప్రెస్ హైవేపై ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు.

## విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్లు అందజేత



**కాకినాడ, పతాకం న్యూస్:** సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు రూ.6.15 లక్షల విలువైన ల్యాప్ టాప్ లు, మొబైల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ విభిన్న ప్రతిభావంతులు వయావృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఏవై.శ్రీనివాసుతో కలిసి ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ .... జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, ఆపైన చదువుతున్న దివ్యాంగులకు, రూ.45 వేల విలువైన ల్యాప్ టాప్, పదో తరగతి ఆ పైన చదువుతున్న బధిరులకు రూ.15 వేల విలువైన మొబైల్ ఫోన్లు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 11 మందికి ల్యాప్ టాపులు, 8 మందికి మొబైల్ ఫోన్లు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.6.15 లక్షల విలువైన ల్యాప్ టాపులు, మొబైల్ ఫోన్లు ఉచితంగా విద్యార్థులకు అందించిందన్నారు. దివ్యాంగ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, విభిన్న ప్రతిభావంతులు వయావృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఉండ్రాజుపు రాజు, వివిధ శాఖల అధికారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొంతేనమ్మ గుడి పున:నిర్మించాలి



**ఆకివీడు, పతాకం న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండల కేంద్రం పెదపేటలో కూల్చిన గొంతేనమ్మ గుడిని పునః నిర్మించాలని, అనంతరం ప్రజాభిప్రాయం మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా కార్యదర్శి తవిటినాయుడు మాట్లాడుతూ... పెదపేటలో వ్యక్తి స్వేచ్ఛను హరించే విధంగా రాజ్యాంగానికి విరుద్ధంగా సిసి కెమెరాలను అమర్చారని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. 144 సెక్షన్ అమలు ఒక్క దళిత వాడకేనా? మరెక్కడా వర్తించదా? అని ప్రశ్నించారు. తక్షణమే ఎమ్మెల్యే ప్రజాభిప్రాయ సేకరణ జరిపి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొక్కా కళ్యాణి, సందక ఉదయ కుమారి, దోకల రవితేజ, గేదెల విజయ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ జంట ఆత్మహత్య..

**కడప, పతాకం న్యూస్:** కడప జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రేమించుకుంటున్న ఓ యువ జంట కొద్ది గంటల వ్యవధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఫోన్‌లో జరిగిన ఓ చిన్న గొడవ ఇద్దరి ప్రాణాలను బలిగొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చెన్నూరు మండలానికి చెందిన యోగేంద్ర కుమార్ వర్మ (19), హేమశ్రీ (19) కడపలోని ఒకే ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన యోగేంద్ర కుమార్, కడప పట్టణంలోని మృత్యుంజయకుంటలో ఉన్న తన బంధువుల ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యోగేంద్ర మరణవార్త తెలుసుకున్న హేమశ్రీ హుటాహుటిన చెన్నూరు నుంచి కడపకు వెళ్లి మృతదేహాన్ని చూద్దామని ప్రయత్నించింది. అయితే యోగేంద్రకుమార్ బంధువులు నిరాకరించి తిరిగి పంపించేశారు. దీంతో హేమశ్రీ చెన్నూరులోని వారి ఇంటి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడుతుండగా, కుటుంబ సభ్యులు అడ్డుకుని ఆమెను గదిలో ఉంచి తాళం వేశారు. ప్రియుడి మరణాన్ని తట్టుకోలేక హేమశ్రీ గదిలోని ఫ్యాన్ కు ఉరేసుకుని ఆమె కూడా ప్రాణాలు తీసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు రెండు వేర్వేరు ప్రాంతాలకు చేరుకున్నారు. యోగేంద్ర మృతిపై చింతకొమ్మదిన్నె పోలీసులు, హేమశ్రీ మృతిపై చెన్నూరు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ టీచర్ల వినూత్న ఆలోచన..!




**కర్నూలు, పతాకం న్యూస్:** ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్కూళ్ళు కు దీటుగా పదవ తరగతి ఫలితాలు వెలువడ్డాయని ఉపాధ్యాయులు హర్షాన్ని వ్యక్తం చేశారు. ఆదోనిలో తొలిసారిగా మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల ఫ్లెక్సీల ఏర్పాటు పదో తరగతి టాపర్ల ఫోటోలతో పట్టణంలో బ్యానర్లు దర్శనమిచ్చాయి. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు చేసిన ఈ వినూత్న ఆలోచనపై ప్రజల నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆదోని పట్టణ విద్యా రంగంలో ఒక వినూత్న మార్పు చోటుచేసుకుందని ఉపాధ్యాయులు అంటున్నారు. సాధారణంగా కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు మాత్రమే తమ విద్యార్థుల ఫలితాలను భారీ ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేసుకుంటాయి. కానీ, అందుకు భిన్నంగా అదోనిలోని ఆర్.ఆర్. లేబర్ కాలనీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.రవి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల చరిత్రలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల విద్యార్థుల ఫోటోలు, మార్కులతో కూడిన భారీ ఫ్లెక్సీలను పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఇలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజయాలను ప్రచార చిత్రాల ద్వారా పబ్లిక్ లో ప్రదర్శించడం అదోనిలో ఇదే మొట్టమొదటిసారి అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచేలా పట్టణంలోనే లేబర్ కాలనీ క్రాంతి నగర్ ప్రధాన రోడ్లలో లక్షల రూపాయలను ఏర్పాటు చేసి ప్రచారం కల్పిస్తున్నారు ఉపాధ్యాయులు. వారు తీసుకున్న ఈ నిర్ణయంపై పట్టణ ప్రజలు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ప్రతి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఇలాగే ఆలోచించి, ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్యను ప్రజల్లోకి తీసుకెళ్తే.. పేద విద్యార్థులకు మరింత మేలు జరుగుతుందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని" ప్రజలు ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పును పునః సమీక్షించాలి



**ఎమ్మిగనూరు, పతాకం న్యూస్:** క్రైస్తవ మతం మారిన దళితులకు రిజర్వేషన్లు వర్తించవని, ఎస్సి హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ తీర్పును పునఃసమీక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని శ్రీరాజేశ్వరి హోటల్ ఫంక్షన్ హాలులో కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన వారు మతం మారినంత మాత్రాన సామాజిక పరిస్థితులు మారలేదని, హోదా, గౌరవం కూడా పెరగలేదని అన్నారు. ఎస్సిలకు మతం మారే స్వేచ్ఛ లేనప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 25లు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. దళితులకు, దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కొనసాగడానికి, కల్పించడానికి జాతీయ స్థాయిలో కలిసి వచ్చే వ్యక్తులతోనూ, శక్తులతోనూ కెవిపిఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. మతం మారిన అగ్రకులాలకు పేదరికం పేరుతో ఇడబ్ల్యుఎస్ ద్వారా పది శాతం రిజర్వేషన్లు పొందుతున్నప్పుడు, క్రైస్తవ మతం మారిన దళితులు రిజర్వేషన్లు ఎందుకు పొందకూడదని ప్రశ్నించారు. దళితుల మత స్వాతంత్ర్య హక్కును హరించి వేస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మతం మారిన దళితులకు రక్షణ కల్పించాలని, దళిత క్రైస్తవులు, దళిత ముస్లిములకు ఎస్సి హోదా కల్పించాలని కోరారు. అనంతరం ఎస్సి హోదా కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాక్షిగా వేదికపై ఐక్యతను చాటారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం అధ్యక్షత వహించారు.

## శంషాబాద్‌లో స్టోన్ క్రషర్‌లను కూల్చివేసిన హైడ్రా



**హైదరాబాద్, పతాకం న్యూస్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని కొత్వాల్ గూడలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్లను హైడ్రా కూల్చివేసింది. పలు కంపెనీలకు చెందిన ఐదు క్రషర్ మెషీన్లతోపాటు 12 ఆర్ఎంసీ యూనిట్లను తొలగించింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్‌శాఖ ఫిర్యాదుతో హైడ్రా ఈ చర్యలు చేపట్టింది. క్రషర్ మిషన్లను తొలగించేందుకు పీబీసీ, మైనింగ్‌శాఖలు హైడ్రా సాయం కోరాయి. రూ.వందల కోట్లు బకాయిలు చెల్లించకుండా అక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు చేశాయి.

# పిల్లల్లో బీపీ రావడానికి కారణాలేమిటి?

హైబీపీ (అధిక రక్తపోటు) అనగానే వయస్సు మళ్లిన వారే ఎక్కువగా గుర్తొస్తుంటారు. కానీ, పిల్లలు, యుక్తవయస్సు వారిలోనూ హైబీపీ లక్షణాలు ఉంటాయి. కొందరికి వంశ పారంపర్యంగా, మరికొందరికి ఇతరత్రా జబ్బులతో ఇది రావొచ్చంటున్నారు నిపుణులు. కారణమేదైనా పిల్లల్లో బీపీని నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు. సకాలంలో గుర్తించి, చికిత్స చేయడం మంచిదని చెబుతున్నారు. అయితే, బీపీ ఉన్న పిల్లల్లో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి, కారణాల గురించి తెలుసుకుందాం! పిల్లల బీపీని తరచూ పరీక్షించటం, చిన్నప్పటి నుంచే గుండె ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడే అలవాట్లను నేర్పించటమూ ముఖ్యమేనని తాజా అధ్యయనం సూచిస్తోంది. ఏడేళ్ల వయస్సులో అధిక రక్తపోటు ఉన్న పిల్లలు 50 ఏళ్ల మధ్యలో హృదయ సంబంధ వ్యాధులతో చనిపోయే ప్రమాదం ఎక్కువగా ఉండవచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ అధ్యయనంలో 1959 నుంచి 1966 మధ్యలో పుట్టిన 38 వేల మందిని ఆరు దశాబ్దాలుగా పరిశీలిస్తూ వచ్చారు. వీరిలో 2016 నాటికి 2837 మంది మరణించగా, 504 మంది చనిపోవటానికి గుండెజబ్బులే కారణమని వెల్లడైంది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు పిల్లల జీవనశైలి గణనీయంగా మారిన నేపథ్యంలో తాజా అధ్యయన ఫలితాలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది చాలావరకు ఆరేళ్లు పైబడ్డవారిలోనే కనిపిస్తుందంటున్నారు నిపుణులు. అధిక బరువు, అధిక కొలెస్టాల్, ఉప్పు ఎక్కువగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం, ఎక్కువసేపు కదలకుండా కూర్చోవటం, కుటుంబంలో ఎవరికైనా రక్తపోటు ఉండటం, జన్యు సమస్యలు వంటివన్నీ దీనికి దోహదం చేస్తాయని చెబుతున్నారు.



ఇది ఆరేళ్ల లోపు పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఇందుకు కిడ్నీ, రక్తనాళ జబ్బులు అనేవి ఎక్కువగా దోహదం చేస్తాయని చెబుతున్నారు. మెదడు మూలం వద్ద రక్తనాళాల్లో అడ్డంకి, రక్తనాళాలు గోడలు మందంగా, గట్టిగా అవటం (ఆర్టీరియో స్క్లిరోసిస్), గుండె నుంచి రక్తాన్ని తీసుకొచ్చే బృహద్ధమని, దాని శాఖల్లో వాపు ప్రక్రియ తలెత్తటం (టకయాస్ డిసీజ్), మూత్ర ఇన్‌ఫెక్షన్లు, మూత్రపిండాల్లో తిత్తులు, వడపోత ప్రక్రియకు తోడ్పడే భాగాలు దెబ్బతినటం, కిడ్నీలకు రక్తన్నీ సరఫరా చేసే రక్తనాళాలు గట్టిపడటం (రీనల్ ఆర్టరీ స్టెనోసిస్) వంటివి హైబీపీకి దారితీస్తాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా, కిడ్నీల మీదుండే అడ్రినల్ గ్రంథి వద్ద ఏర్పడే కణితులతోనూ (ఫియోక్రోమోసైటోమా) బీపీ పెరుగుతుందని తెలియజేస్తున్నారు. అలాగే, పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, ముఖ్యంగా బృహద్ధమని సంకోచించటమూ (కోఆర్?క్టేషన్ ఆఫ్ అయోర్టా) హైబీపీకి దారితీస్తుందని వెల్లడిస్తున్నారు. ఈ సమస్యలు చిన్నప్పుడు పెద్దగా ఇబ్బంది పెట్టవని కానీ, వయసు పెరుగు తున్నకొద్దీ ఎక్కువవుతూ వస్తుందని అంటు న్నారు. దీంతో వ్యాయామాలు, కష్టమైన పనులు చేసేటప్పుడు తలకు, చేతులకు రక్తపోటు బాగా పెరిగిపోతుందని చెబుతున్నారు. పిల్లల్లో హైబీపీని కచ్చితంగా నిర్ధారించడం చాలా ముఖ్యం. దీంతో అనవసరంగా మందులు ఇవ్వకుండా జాగ్రత్త పడవచ్చని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు ఒకసారి పరీక్ష చేస్తే చాలదని, కనీసం రెండు సార్లయినా పరీక్షించాలని అంటున్నారు. రెండు సార్లూ బీపీ ఎక్కువుంటేనే అధిక రక్తపోటు ఉందని అనుకోవచ్చని సూచిస్తున్నారు. ఇలా వేర్వేరు రోజుల్లో కనీసం మూడు సార్లు పరీక్ష చేసి సమస్యను నిర్ధారించాల్సి ఉంటుందని తెలియజేస్తున్నారు. అవసరమైతే ఆంబులేటరీ పరికరంతోనూ రోజంతా బీపీని పరిశీలించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. పిల్లల్లో అధిక రక్తపోటు ఉన్నా ఎలాంటి లక్షణాలు కనిపించవు. అయితే, తలనొప్పి, వాంతులు, ఛాతీ నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస ఆడకపోవడం లాంటి సంకేతాలతో గుర్తించవచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో వీలున్నప్పుడల్లా పిల్లలకు రక్తపోటు పరీక్ష చేయించటం మంచిదంటున్నారు నిపుణులు. ఆటల పోటీలకు వెళ్లే ముందు ఒకసారి రక్తపోటును పరీక్షించటం మేలని చెబుతున్నారు. ఆసుపత్రికి ఎప్పుడు వెళ్లినా, జలుబు, దగ్గు వంటి వాటి కోసం వెళ్లినప్పుడైనా, కనీసం ఏడాదికి ఒకసారైనా బీపీ పరీక్ష చేయటం మేలని సూచిస్తున్నారు. దీర్ఘకాలంగా అధిక రక్తపోటుతో బాధపడే పిల్లలకు గుండె కండరం మందం కావొచ్చంటున్నారు నిపుణులు. ఇది గుండె వైఫల్యానికి దారితీయొచ్చని హెచ్చరిస్తున్నారు. కిడ్నీలో రక్తనాళాలు దెబ్బతిని, వడపోత ప్రక్రియ అస్తవ్యస్తమవ్వచ్చని చెబుతున్నారు. కంట్లోని రెటీనా దెబ్బతినే ప్రమాదమూ ఉందని పేర్కొంటున్నారు. మెదడుకు రక్త సరఫరా చేసే నాళాలు దెబ్బతింటే తలనొప్పి, తలతిప్పు తలెత్తచ్చని తెలియజేస్తున్నారు. అంతేకాకుండా, రక్తనాళాలు చిట్లిపోయి పక్షవాతం వంటి తీవ్ర సమస్యలూ ముంచుకురావొచ్చని వివరిస్తున్నారు. పిల్లల్లో హైబీపీ చికిత్సలో మందుల కన్నా జీవనశైలి మార్పులకే అధిక ప్రాధాన్యం ఉందంటున్నారు నిపుణులు. తాజా కూరగాయలు, పండ్లు, పీచుతో కూడిన ఇతర పదార్థాలు ఎక్కువగా తినటం, చక్కెరతో చేసే పానీయాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

## ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తోన్న బీజేపీ : కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అస్సాంలో బిజెపి భారీ మెజార్టీ సాధించింది. ఈ నేపథ్యంలో బిజెపిపై ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసి హత్య చేస్తోందని తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బిజెపి తన ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు ఓటర్ల తొలగింపు వంటి ఎత్తునుడలను ఉపయోగిస్తోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కూడా బిజెపి అలాంటి ఎత్తుగడలనే ఉపయోగించి భారీ మెజార్టీ సాధించిందని ఆయన ఆరోపించారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసి హత్య చేసిన తీరు పరిశీలిస్తే.. గత మూడు నాలుగు నెలలుగా బెంగాల్‌పైనే బిజెపి దృష్టి. బెంగాల్‌లో ఎస్‌ఐఆర్ పేరుతో ఓటర్ల తొలగింపు వంటి ప్రక్రియలను మనం చూస్తూనే ఉన్నాం. బీహార్, మహారాష్ట్ర కూడా ఇదే మాదిరి ఎస్‌ఐఆర్ పేరుతో ఓటర్ల తొలగింపు జరిగింది. అక్కడ విజయాలను సాధించింది. ఢిల్లీలో నా సొంత నియోజకవర్గంలో కూడా ఇదే జరిగింది. నేను జైలుకి వెళ్లకముందు అక్కడ 1,48,000 ఓట్లు ఉంటే.. నేను జైలు నుంచి వచ్చిన తర్వాత 1,06,000 ఓట్లే ఉన్నాయి. కేవలం ఆరు నెలల్లో 42 వేల ఓట్లను తొలగించారు. గతసారి నేను 30 వేల ఓట్ల తేడాతో గెలిచాను. 42 వేల ఓట్లు తొలగిస్తే.. కేవలం 2025 ఎన్నికల్లో మూడు వేల ఓట్లతో ఓడిపోయాను. బిజెపి ఇలా వ్యవహరిస్తుంటే ఎవరైనా ఎలా గెలవగలరు? ఓట్లన్నీ రద్దు చేస్తుంటే ఏమీ మిగలదు. ఇదే గందరగోళం దేశవ్యాప్తంగా కొనసాగుతుంది. అందుకే నేడు ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉంది అని కేజ్రీవాల్ అన్నారు.

## ఆకివీడు రామాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్.. పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు!

**ఖ, పతాకం న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయ నిర్మాణంపై దాఖలైన అభ్యంతరాలను హైకోర్టు తోసిపుచ్చింది. ఆలయ నిర్మాణానికి అధికారులు ఇచ్చిన అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం... ఆలయానికి సంబంధించిన చారిత్రక ఆధారాలను సమర్థించింది. గత 80 ఏళ్లుగా అక్కడ రామాలయం ఉన్నట్లు రికార్డులు స్పష్టంగా చెబుతున్నాయని న్యాయస్థానం పేర్కొంది. అధికారులు అన్ని రకాల ఆధారాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో అధికారుల నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, పిటిషన్‌ను కొట్టివేసింది.

# వైద్య కళాశాల నిర్మాణమెప్పుడు?

## ప్రభుత్వం చొరవ చూపాలని జిల్లా వాసుల విన్నపం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. నేటికీ అధికారికంగా స్థల ఎంపిక ఖరారు కాకపోవడంతో అసలు పనులు జరుగుతాయా? లేదా అన్నది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే జిల్లావాసులకు ఆధునిక వైద్యసేవలు అందుతాయి. ఇక్కడి వైద్య విద్యార్థులకు కూడా ఇక్కట్లు తప్పుతాయి. పొరుగు జిల్లాలకు పరుగులెత్తాల్సిన అవసరం ఉండదు. మొత్తంగా జిల్లాకు ఎంతో కీలకమైన వైద్య కళాశాల నిర్మాణంపై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేస్తున్నట్టు గత వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. అప్పట్లో అధికారులు గరుగుబిల్లి మండలంలో స్థలాన్ని కూడా పరిశీలించారు. కానీ శంకుస్థాపన కూడా చేయలేకపోయారు. గత ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణంపై దృష్టి సారించలేదు. దీంతో ప్రజలు ఎంతో నిరాశ చెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఈ సమస్యను పరిగణనలోకి తీసుకుని.. జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పీపీపీ పద్ధతిలో నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. దీంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అయితే పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాల నిర్మాణానికి ఇంకా మొదటి దశ అడుగులు కూడా పడలేదు. దీంతో పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి.. ఇంకెప్పటికి పూర్తవుతాయన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం అనుకూలంగా ఉన్నప్పటికీ.. ఇందుకోసం ప్రైవేట్ వ్యక్తులు ముందుకొచ్చే పరిస్థితి ఉందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మారుమూల జిల్లాలో ప్రైవేటు వ్యక్తులు పెద్దఎత్తున పెట్టుబడులు పెడతారా? అన్నది కూడా సందేహంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే చొరవ చూపాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

మొదటి విడతగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైద్య కళాశాల నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే రెండో విడతలో మన్యం జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణాలు జరుగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ఇప్పటివరకు ఆ దిశగా ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో జిల్లాపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించి వైద్య కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు. దీనిపై ఏపీఎంఐడీసీ డీఈ సిమ్మన్నను వివరణ కోరగా.. గతంలో గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో గుర్తించిన స్థలంలోనే వైద్య కళాశాల నిర్మాణం చేపడతామని తెలిపారు.




## రోహిత్‌శర్మ, రికెల్టన్ రాణించడంతో..

# అదరగొట్టిన ముంబై ఇండియన్స్




ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపుగా మూసుకుపోయిన వేళ.. మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ అదరగొట్టింది. వెటరన్ ఓపెనర్ రోహిత్ శర్మ (44 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 84) చాలా రోజుల తర్వాత బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతడికి రికెల్టన్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 83) సహకరించడంతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ముంబై నెగ్గింది. పది మ్యాచ్‌ల్లో ఈ జట్టుకిది కేవలం మూడో విజయం. అలాగే మిగిలిన నాలుగు మ్యాచ్‌లనూ గెలిచి మిగతా టీమ్స్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అటు కేవలం 4 పాయింట్లతో ఉన్న లఖ్‌నవూకు ఇది వరుసగా ఆరో ఓటమి, దీంతో ఈ జట్టు కూడా దాదాపుగా నిష్క్రమించినట్టే. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (21 బంతుల్లో 1 ఫోర్, 8 సిక్సర్లతో 63), మార్ష్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 44), హిమ్మత్ (31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 40 నాటౌట్), మార్‌క్రమ్ (25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 31 నాటౌట్) రాణించారు. బాష్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసి గెలిచింది. సిద్ధార్థ్‌కు 2వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గా రికెల్టన్ నిలిచాడు. భారీ ఛేదనను ఆత్మవిశ్వాసంతో ఆరంభించిన ముంబై ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు రోహిత్, రికెల్టన్‌ల ధాటికి లఖ్‌నవూ బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. ముందుగా రికెల్టన్ జోరు చూపించినా.. కాస్త కుదురుకున్నాక రోహిత్ జోరు ఆరంభమైంది. ఆరో ఓవర్‌లో 4,4,6,6తో రోహిత్ ఒక్కసారిగా గేరు మార్చాడు. దీంతో ముంబై పవర్‌ప్లేలో 71 పరుగులతో నిలిచింది. 22 బంతుల్లో రికెల్టన్, 27 బంతుల్లో రోహిత్ ఫిఫ్టీలు పూర్తి చేశారు. తొమ్మిదో ఓవర్‌లో రికెల్టన్ 6,4,6తో 23 రన్స్ సమకూరాయి. అలాగే మొహిసిన్ ఓవర్‌లోనూ 4,6,6తో చెలరేగిన అతడు ఐదో బంతికి ఇన్‌గ్లి?సకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పడింది. అటు రోహిత్ మాత్రం బౌండరీలతో తన దూకుడు కొనసాగించడంతో పరుగుల వేగం తగ్గలేదు. సెంచరీ దిశగా సాగుతున్న హిట్‌మ్యాన్‌ను స్పిన్నర్ సిద్ధార్థ్ 14వ ఓవర్‌లో అవుట్ చేశాడు. అప్పటికి ఆరు ఓవర్లలో 52 పరుగులే కావాల్సి ఉండడంతో ముంబై ఇబ్బందిపడలేదు. తిలక్ (11), సూర్య (12) విఫలమైనా నమన్ ధిర్ (23 నాటౌట్) చివరికంటా నిలిచి 8 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్ మెరుపు వేగంతో సాగింది. నికోలస్ పూరన్ సీజన్‌లో తొలిసారి బ్యాట్ ఝుళిపించాడు. అతడికి ఓపెనర్ మార్ష్ సహకరించడంతో ముంబై బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. దీంతో 250 పరుగులు కూడా ఖాయమే అనుకున్న వేళ ఈ ఇద్దరి నిష్క్రమణ తర్వాత జట్టు లయ తప్పింది. దీనికి తోడు డెత్ ఓవర్లలో ముంబై బౌలర్లు మరింత కట్టడి చేయడంతో ఎల్‌ఎ?సజీ ఆశించిన స్కోరు చేయలేకపోయింది. మార్ష్ తొలి ఓవర్‌లోనే 6,4తో బ్యాట్‌కు పనిజెప్పాడు. కానీ మూడో ఓవర్‌లో ఓపెనర్ ఇన్‌గ్లిస్ (13)ను స్పిన్నర్ ఘజన్‌ఫర్ అవుట్ చేశాడు. అటు బుమ్రా ఓవర్‌లో మార్ష్ 6,4,4తో 21 పరుగులు రాబట్టగా.. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పూరన్ ఐదో ఓవర్‌లో మూడు సిక్సర్లతో చెలరేగాడు. ఘజన్‌ఫర్ ఓవర్‌లోనూ అతడు 4,6,6 బాదగా ఎల్‌ఎ?సజీ 90/1తో పవర్‌ప్లేలో తమ అత్యధిక స్కోరును సాధించింది. అలాగే 16 బంతుల్లోనే పూరన్ హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. ఎనిమిది ఓవర్లలోనే 123 పరుగులు చేసిన లఖ్‌నవూ దూకుడుకు పేసర్ బాష్ బ్రేక్ వేశాడు. దీంతో రెండో వికెట్‌కు 35 బంతుల్లోనే 94 పరుగుల తుఫాన్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత మధ్య ఓవర్లలో పరుగులు నెమ్మదించగా, కెప్టెన్ పంత్ (15)తో పాటు తొలి ఐపీఎల్ ఆడిన అక్షత్ (11) ఒక్క ఓవర్ వ్యవధిలోనే పెవిలియన్‌కు చేరారు.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్..

## అగ్రస్థానంలోనే టీమిండియా




టీ20 క్రికెట్ ఫార్మాట్‌లో భారత జట్టు ఆధిపత్యం కొనసాగుతోంది. తాజాగా ఐసీసీ విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో టీమిండియా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ ఏడాది మార్చిలో జరిగిన టీ20 ప్రపంచ కప్‌ను టీమిండియా ముద్దాడిన సంగతి తెలిసిందే. వరుసగా రెండు సార్లు, మొత్తంగా మూడుసార్లు ఈ ట్రోఫీని అందుకున్న తొలి జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. ఇప్పుడు ర్యాంకింగ్స్ జాబితాలో 275 రేటింగ్ పాయింట్లతో సత్తా చాటింది. టీమిండియా తర్వాత ఇంగ్లండ్ జట్టు 262 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా(258), న్యూజిలాండ్(247) పాయింట్లతో మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి. అయితే టాప్ 7 జట్లలో ఎలాంటి మార్పులు జరగలేదు. సౌతాఫ్రికా(244), పాకిస్థాన్(240), వెస్టిండీస్(233) పాయింట్లతో తమ స్థానాలను నిలబెట్టుకున్నాయి. టీ20 ప్రపంచ కప్ 2026లో పేలవ ప్రదర్శన కనబర్చిన శ్రీలంక జట్టు.. ఆరు పాయింట్లు కోల్పోయి 9వ స్థానానికి పడిపోయింది. ఇదిలా ఉంటే, ద్వైపాక్షిక సిరీస్‌ల్లో రాణించిన బంగ్లాదేశ్(225) 8వ స్థానానికి ఎగబాకింది. అఫ్గానిస్తాన్(220) తన పదో స్థానాన్ని పదిలపర్చుకుంది. టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శనలు చేసి.. ప్రపంచ మేటి జట్లకు గట్టి పోటీనిచ్చిన అమెరికా రెండు స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి చేరుకోవడం విశేషం. నెదర్లాండ్స్, స్కాట్లాండ్ జట్లు వరుసగా 14, 15వ స్థానాల్లో కొనసాగుతున్నాయి.




# 'జైలర్ 2' తెలుగు రైట్స్‌కు భారీ డిమాండ్!



సూపర్ స్టార్ రజనీకాంత్ గత చిత్రం 'కూలీ' తెలుగు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున ఈ సినిమాలో కీలక పాత్ర పోషించినప్పటికీ, సుమారు రూ. 53 కోట్లకు అమ్ముడైన ఈ చిత్రం పూర్తిస్థాయిలో రికవరీ సాధించలేకపోయింది. అయినప్పటికీ, ఆ ప్రభావం రజనీ తర్వాత సినిమాపై ఏమాత్రం పడకపోవడం విశేషం. ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'జైలర్ 2' చిత్రంపై ఇండస్ట్రీలో భారీగా అంచనాలున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తెలుగు రైట్స్‌కు కూడా భారీ డిమాండ్ ఏర్పడింది. తెలుగు సినిమా ముఖ్యంగా ఈ సినిమా బిజినెస్ విషయంలో నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ చాలా కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గత సినిమాల లాభ నష్టాలతో సంబంధం లేకుండా, ఏ సినిమాకు ఆ సినిమానే అన్నట్లుగా తమ బిజినెస్ డీల్స్ ఉండేలా ఈ సంస్థ ప్లాన్ చేస్తుంది. 'జైలర్ 2' చిత్రానికి ఉన్న విపరీతమైన క్రేజ్ దృష్ట్యా, రైట్స్ కోసం సంప్రదించిన నిర్మాతలకు ఏమాత్రం బేరసారాలకు తావులేకుండా స్పష్టమైన సందేశం పంపినట్లుగా సమాచారం. వీశీజఅవం

తాజాగా వినిపిస్తోన్న వార్తల ప్రకారం.. 'జైలర్ 2' తెలుగు రైట్స్ కోసం సన్ పిక్చర్స్ ఏకంగా రూ. 62 కోట్లు డిమాండ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. సినిమాపై ఉన్న హైప్ చూస్తుంటే ఈ భారీ ధర చెల్లించేందుకు కూడా కొందరు రెడీగా ఉన్నారట. మరి గతంలో రజనీ సినిమాలను పంపిణీ చేసిన ఏషియన్ ఫిలిమ్స్, దిల్ రాజు, సురేష్ ప్రొడక్షన్స్ వంటి దిగ్గజ సంస్థలు మళ్ళీ ఈ సినిమా కోసం చేతులు కలుపుతాయా? సన్ పిక్చర్స్ కోట్ చేసిన అమౌంట్‌ని చెల్లించి సినిమాను రిలీజ్ చేస్తాయా? అనేది చూడాల్సి ఉంది.

మళ్లీ వాయిదాపడ్డ..

# ప్రభాస్ 'స్పిరిట్'



బాహుబలి తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ప్రభాస్ నుంచి ఒక సినిమా వస్తుందంటే చాలు.. దాని కోసం కేవలం టాలీవుడ్ మాత్రమే కాదు, యావత్ ప్రపంచ సినీ ప్రేమికులు ఎదురచూస్తుంటారు. ప్రస్తుతం డార్లింగ్ లైనప్‌లో ఉన్న ప్రాజెక్టుల్లో అత్యంత క్రేజీ మూవీ ఏదంటే.. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న స్పిరిట్. ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది.

నిజానికి స్పిరిట్ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర యూనిట్ ప్రాథమికంగా భావించింది. కానీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆ తేదీకి సినిమా రావడం కష్టమనే సంకేతాలు అందుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ప్రభాస్ చేతిలో ఉన్న ఇతర భారీ ప్రాజెక్టులే. ముఖ్యంగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫౌజీ. ఈ సినిమా షూటింగ్ ఆశించిన వేగంతో సాగడం లేదు. దాదాపు 30 శాతం షూటింగ్ ఇంకా పెండింగ్‌లో ఉండటం గమనార్హం. దీనితో పాటు, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కల్కి 2898 ఏడీ సీక్వెల్ కల్కి-2 పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజ నటుల పోర్షన్స్‌ను పూర్తి చేశారు. త్వరలోనే ప్రభాస్ ఈ షూటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది.




# ఆ వార్తల్లో నిజం లేదంటున్న కియారా అద్వానీ



ఒక స్టార్ హీరో సినిమా రిలీజ్ అవుతోంది అంటే అది రిలీజ్ అయ్యేవరకు ఏదో ఒక పుకారు వస్తూనే ఉంటుంది. కొందరు వాటిపై రియాక్ట్ అవుతారు. మరికొందరు సైలెంట్ గా ఉండిపోతారు. సోషల్ మీడియాలో రెండురోజులుగా టాక్సిక్‌సినిమా గురించి ఒక వార్త హల్చల్ చేస్తోంది. కన్నడ స్టార్ హీరో యశ్ నటిస్తోన్న చిత్రం టాక్సిక్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వానీ నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ హీరోయిన్లుగా నటిస్తోన్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సినిమాలో నటిస్తోన్న బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ.. యశ్ తో చేసిన బోల్డ్ సీన్స్ చాలా ఇబ్బందిగా ఉన్నాయని, వాటిని ట్రిమ్ చేయాలని మేకర్స్ ని కోరినట్లు టాక్ నడిచింది. షూట్ చేసినప్పుడు బాగానే ఉన్నా.. అవుట్ పుట్ లో చూశాక చాలా ఇబ్బందికరంగా అనిపించాయని, తన బోల్డ్ సీన్స్ తానే చూసుకోలేకపోయిందని, అందుకే ఆ సీన్స్‌ని ట్రిమ్ చేయమని చెప్పినట్లు సమాచారం.

ఇక ఈ వార్తపై ఎట్టకేలకు కియారా స్పందించింది. ఆ వార్తలో ఎలాంటి నిజం లేదని చెప్పుకొచ్చింది. ఆ రూమర్ పూర్తిగా అర్థం లేనిదని కొట్టిపారేసింది. దీంతో కియారా ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. అందాలను ఆరబోయడంలో ముందుండే కియారా.. బోల్డ్ సీన్స్ ని వద్దంది అంటే అందరూ షాక్ అయ్యారు. తల్లిగా మారాక ఆమె తన అందాల ఆరబోతకు ఫుల్ స్టాప్ పెట్టిందేమో అనుకున్నారు. కానీ, అదంతా అబద్ధం అని తెలిసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. త్వరలోనే టాక్సిక్ కొత్త రిలీజ్ డేట్ ని ప్రకటించనుంది. మరి కెజిఎఫ్ తరువాత యశ్ టాక్సిక్ తో ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**